TGTEL/26/A2635

DD9 వాస్తవాలు పలుకు వార్త

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి: 02 | సంచిక: 51 | 03-07-2026 శుక్రవారం | పేజీలు: 08 | వెల: 3/-

## గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలి..










## పోలీస్ శాఖలో ఏసీబీ భారీ స్కెచ్

**డీఎస్పీ భీమ్ రెడ్డి ఇళ్లపై ఏకకాలంలో దాడులు**
**వెండి బిందెలు, విదేశీ మద్యం లభ్యం**
**ఆదాయానికి మించిన ఆస్తుల గుట్టురట్టు**
**విశ్వసనీయ సమాచారంతో రంగంలోకి..**
**తారామతి బారామతి లగ్జరీ విల్లాలో సోదాలు**
**బంధువులు, సన్నిహితుల ఇళ్లలోనూ తనిఖీల పర్వం**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

హైదరాబాద్ మహానగరంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మరోసారి తమ బలగాలతో విరుచుకుపడ్డారు. ఈసారి ప్రభుత్వ సామాన్య ఉద్యోగులు కాకుండా ఏకంగా పోలీస్ శాఖలోని ఒక ఉన్నతాధికారే లక్ష్యంగా ఈ దాడులు జరగడం సంచలనం సృష్టిస్తోంది. తెలంగాణ డీజీపీ కార్యాలయంలోని కంప్యూటర్స్ విభాగంలో అత్యంత కీలకమైన బాధ్యతల్లో ఉన్న డీఎస్పీ భీమ్ రెడ్డి నివాసాలపై అధికారులు గురువారం ఉదయాన్నే దాడులు ప్రారంభించారు. ఏసీబీ అధికారుల అకస్మాత్తు ఎంట్రీతో సదరు అధికారి కుటుంబ సభ్యులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. డీఎస్పీ భీమ్ రెడ్డి తన అధికారిక ఆదాయానికి మించి విపరీతమైన ఆస్తులను

మిగతా 3లో..

# మంత్రులు భయపడి పారిపోయారు

**మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు**
**గురుకుల టెండర్లు, అప్పులపై ఆరోపణలు**
**హరీశ్‌రావు సహ బీఆర్ఎస్ నేతల అరెస్ట్.. విడుదల**
**బహిరంగ చర్చల సవాళ్లతో రోడ్డెక్కిన ప్రధాన పార్టీలు**
**సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ వేదికగా ఆర్ఎస్పీ సవాల్**
**ఫోన్లు చేసినా ఎత్తని అధికార పక్ష నేతలు**
**ఖాకీల బలప్రయోగం మధ్య బీఆర్ఎస్ నేతల అరెస్టులు**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్రంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీల మధ్య సాగుతున్న రాజకీయ పోరు సరికొత్త రణరంగానికి దారితీసింది. గురుకుల పాఠశాలల టెండర్లలో భారీగా అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ చేసిన ఆరోపణలు, అలాగే రాష్ట్ర ప్రభుత్వ అప్పులపై ఇరు పార్టీల మధ్య నడిచిన సవాళ్లు, ప్రతి సవాళ్లు గురువారం నాడు వీధి పోరాటాలుగా మారాయి. పల్లెలు, పట్టణాల అభివృద్ధిని పక్కనబెట్టి నేతలు బహిరంగ చర్చల కోసం రోడ్లపైకి రావడంతో హైదరాబాద్ నగరంలో ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గురుకులాల టెండర్లలో అవినీతి జరిగిందన్న ఆరోపణలను కాంగ్రెస్ మంత్రులు తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ ఆరోపణలను నిరూపిస్తే తాను తక్షణమే మంత్రి పదవికి రాజీనామా చేస్తానని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సవాల్ విసిరారు. ఈ క్రమంలోనే మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, అజారుద్దీన్‌లు గురువారం ఉదయాన్నే అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్క్ అమరవీరుల స్తూపం వద్దకు చేరుకున్నారు. తాము అవినీతికి పాల్పడినట్లు బీఆర్ఎస్ నేతలు నిరూపిస్తే, ముగ్గురం మంత్రులం ఇదే గన్‌పార్క్ సాక్షిగా ముక్కు నేలకు రాస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ సంచలన ప్రకటన చేశారు. ఇదిలావుండగా, బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కాంగ్రెస్ మంత్రుల సవాల్‌పై ప్రతి సవాల్ విసిరారు. తాము సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో చర్చకు సిద్ధంగా ఉన్నామని, కాంగ్రెస్ మంత్రులు అక్కడికి రావాలని కోరారు. అయితే దీనిపై మంత్రులు భిన్నంగా స్పందించారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్థాయికి తాము రానవసరం లేదని, ఆయన చర్చకు వస్తే కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధులు మాత్రమే ప్రెస్ క్లబ్‌కు వస్తారని స్పష్టం చేశారు. కేటీఆర్, హరీశ్‌రావు లాంటి మాజీ మంత్రులు లేదా ఎమ్మెల్యేలు

మిగతా 2లో..

# వీబీ జీరామ్‌జీ అమలుకు క్యాబినెట్ ఆమోదం

**అభ్యంతరాలపై సుప్రీంకోర్టుకు వెళ్లనున్న రాష్ట్ర ప్రభుత్వం**
**మూసీ తొలి దశ పనులకు రూ.7,345 కోట్లు మంజూరు**
**టిమ్స్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో 6,278 పోస్టులు**
**ఉపాధ్యాయులకు కూడా అల్పాహారం, మధ్యాహ్న భోజనం**
**1.50 లక్షల మంది సిబ్బందికి పథకం వర్తింపు**
**గోదాములు, విద్యాసంస్థలకు భూముల కేటాయింపు**
**మూసీ ప్రాజెక్టుకు కొత్త పోస్టుల సృష్టికి ఆమోదం**
**పలు అభివృద్ధి, సంక్షేమ నిర్ణయాలకు గ్రీన్ సిగ్నల్**
**సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం జరిగిన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ఉపాధి హామీ పథకానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీబీ జీరామ్‌జీ చట్టం అమలు, మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి, టిమ్స్ ఆస్పత్రుల్లో భారీ ఉద్యోగాల భర్తీ, ఉపాధ్యాయులకు భోజన పథకం విస్తరణ, గిడ్డంగులు, విద్యాసంస్థలకు భూముల కేటాయింపు వంటి కీలక అంశాలపై క్యాబినెట్ నిర్ణయాలు తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీబీ జీరామ్‌జీ చట్టంలోని కొన్ని నిబంధనలపై రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. రాష్ట్రాలను సంప్రదించకుండా చట్టాన్ని అమల్లోకి తీసుకురావడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని అభిప్రాయపడింది. అయితే ఉపాధి హామీ కూలీలకు పనులు నిలిచిపోకుండా ఉండే ఉద్దేశంతో రాష్ట్రంలో ఈ చట్టాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. అదే సమయంలో చట్టంలోని అభ్యంతరకర నిబంధనలను సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాలని కూడా మంత్రివర్గం నిర్ణయించింది. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు తొలి దశ పనులకు రూ.7,345.12 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. తొలి దశలో 21 కిలోమీటర్ల మేర అభివృద్ధి పనులు చేపట్టనుండగా, ప్రాజెక్టు నిర్వహణ కోసం కొత్తగా పోస్టుల

మిగతా 2లో..



# గన్‌పార్క్ వద్ద హైడ్రామా

**గురుకుల టెండర్ల సవాల్‌తో దద్దరిల్లిన హైదరాబాద్**
**హరీశ్‌రావు అరెస్టుతో తారస్థాయికి చేరిన రాజకీయ రచ్చ**
**సవాళ్లు, ప్రతి సవాళ్లతో హీటెక్కిన భాగ్యనగరం**
**గన్‌పార్క్ సాక్షిగా కాంగ్రెస్, బీఆర్ఎస్ ముఖాముఖి పోరు**
**అమరవీరుల స్తూపం వద్ద కాంగ్రెస్ మంత్రుల మోహరింపు**
**గులాబీ నేతలు ఎవరు వచ్చినా చర్చకు సిద్ధం**
**బీఆర్ఎస్ నేతలవి పచ్చి అబద్ధాలన్న మంత్రి పొన్నం**
**గురుకుల టెండర్ల ప్రక్రియ అంతా పారదర్శకమేనని వెల్లడి**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాజకీయాలు ఒక్కసారిగా ఊహించని మలుపు తిరిగాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య సాగుతున్న మాటల యుద్ధం కాస్తా వీధి పోరాటంగా మారింది. గురుకుల పాఠశాలల టెండర్ల కొనుగోలు వ్యవహారంలో భారీ ఎత్తున అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ చేసిన

మిగతా 2లో..

# భారత్-జపాన్ బంధంలో చారిత్రాత్మక మైలురాయి

**రక్షణ రంగంలో తొలిసారి ఉమ్మడి ప్రాజెక్ట్**
**సరికొత్త శిఖరాలకు ద్వైపాక్షిక వ్యూహాత్మక మైత్రి**
**పరస్పర నమ్మకమే మన అతిపెద్ద వ్యూహాత్మక ఆస్తి**
**భారత్-జపాన్ 16వ వార్షిక సదస్సులో ప్రధాని మోదీ వ్యాఖ్యలు**
**జపాన్ తొలి మహిళా ప్రధాని తకాయిచి నా చెల్లెలు**
**నారా ప్రాంత ఉమ్మడి బౌద్ధ వారసత్వాన్ని గుర్తుచేసిన మోదీ**
**ఏఐ, సరికొత్త సాంకేతికత కోసం ఉమ్మడి విజన్ ఆవిష్కరణ**
**భారత్‌కు భారీగా జపాన్ పెట్టుబడులు**
**120 నూతన వ్యాపార ఒప్పందాలతో 10 బిలియన్ డాలర్ల రాక**
**రానున్న దశాబ్ద కాలంలో జపాన్ కంపెనీల సంఖ్య రెట్టింపు**
**10 ట్రిలియన్ల పెట్టుబడులే లక్ష్యంగా ముందడుగు**
**ఫార్మా, వైద్య రంగాల్లో చేతులు కలిపిన ఇరు దేశాలు**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

భారతదేశం, జపాన్ దేశాల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న అంతర్జాతీయ స్నేహ బంధం సరికొత్త స్థాయికి చేరుకుంది. దిల్లీ వేదికగా నిర్వహించిన భారత్‌జపాన్ 16వ వార్షిక శిఖరాగ్ర సదస్సులో రెండు దేశాల అగ్రనేతలు పాల్గొని ద్వైపాక్షిక సంబంధాలపై కీలక ప్రకటనలు చేశారు. ఈ సందర్భంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ, ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో రెండు దేశాల మధ్య ఉన్న 'పరస్పర విశ్వాసమే'

మిగతా 2లో..



# నా అంకెలు తప్పయితే రాజీనామా చేస్తా

**తెలంగాణ అప్పులపై మంత్రి జూపల్లి సవాల్**
**కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్**
**రికార్డులతో సహా తెలంగాణ భవన్‌కు వచ్చేందుకు సిద్ధం**
**బీఆర్ఎస్ నేతల బుకాయింపులపై మంత్రి ఆగ్రహం**
**బీఆర్ఎస్ అప్పుల వల్ల నెలకు రూ.6 వేల కోట్ల వడ్డీ**
**ఈ పాపానికి కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదు?**
**గులాబీ నేతలకు మంత్రి సూటి ప్రశ్న**
**కాళేశ్వరం పేరిట జరిగిన దోపిడీపై ధ్వజం**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, గత ప్రభుత్వ హయాంలో జరిగిన అప్పుల వ్యవహారంపై రాష్ట్ర ఆబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు బీఆర్ఎస్ పార్టీకి అత్యంత ప్రతిష్టాత్మకమైన సవాల్ విసిరారు. బుధవారం తాను శాసనసభ, మీడియా వేదికగా వెల్లడించిన రాష్ట్ర అప్పుల అంకెలు, వివరాలలో ఏ ఒక్కటి తప్పని నిరూపించినా తక్షణమే తన మంత్రి పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమని ఆయన ప్రకటించారు. గత ప్రభుత్వం చేసిన అడ్డగోలు అప్పుల వల్లే నేడు రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో

మిగతా 2లో..



# పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు

**క్యూర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు**
**త్వరలో టెండర్లకు ప్లాన్ చేస్తున్న ప్రభుత్వం**
**ఇందిరమ్మ ఇళ్ల టెండర్లకు సర్వం సిద్ధం**
**స్థల సేకరణ తుది దశకు చేరిందన్న పొంగులేటి**
**గోషామహల్‌లో లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీ**
**ఒకే వేదికపై చేతులు కలిపిన అధికార, ప్రతిపక్ష నేతలు**
**క్యూర్ పరిధిలోని 19 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్**
**తొలి విడతగా నియోజకవర్గానికి వెయ్యి ఇళ్ల నిర్మాణం**
**ఎకరా స్థలం రూ.200 కోట్లు ఉన్నా పేదలకే సొంతం**
**విలువను పక్కనబెట్టి గూడు కల్పిస్తామన్న ప్రభుత్వం**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్రంలో నిరుపేదలకు సొంత ఇంటి కల నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ముందుకు సాగుతోంది. క్యూర్ పరిధిలో నిర్మించ తలపెట్టిన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి త్వరలోనే భారీ ఎత్తున టెండర్లు పిలవనున్నట్లు రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఈ ఇళ్ల నిర్మాణానికి అత్యంత కీలకమైన స్థల సేకరణ ప్రక్రియ ప్రస్తుతం తుది దశకు చేరుకుందని ఆయన

మిగతా 2లో..



## నకిలీ అక్రెడిటేషన్ కార్డుపై పోలీసులకు డీపీఆర్ఓ ఫిర్యాదు

**నిజామాబాద్ జిల్లా జులై 02(డీడీ9 వార్త):**

నిజామాబాద్ జిల్లాలో కలెక్టర్ సంతకం ఫోర్జరీ ఉదంతం తీవ్ర కలకలం రేపింది. వాట్సాప్‌తో పాటు ఇతర సామాజిక మాధ్యమాల్లో పి.శ్రీనివాస్ అనే వ్యక్తి పేరిట నకిలీ మీడియా అక్రెడిటేషన్ కార్డు చెలామణి అవుతున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. ఈ నకిలీ కార్డును సృష్టించేందుకు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు గుర్తించారు. దీనిపై స్పందించిన నిజామాబాద్ జిల్లా పౌర సంబంధాల అధికారి ఎన్.పద్మశ్రీ జిల్లా పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. సదరు అక్రెడిటేషన్ కార్డును సమాచార పౌర సంబంధాల శాఖ నిజామాబాద్ జిల్లా కార్యాలయం నుంచి జారీ చేయలేదని డీపీఆర్ఓ పద్మశ్రీ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. కలెక్టర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ కార్డును తయారు చేసిన సదరు వ్యక్తిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులను కోరారు. ఎవరైనా ఈ తరహాలో నకిలీ అక్రెడిటేషన్ కార్డులను తయారు చేసినా, లేదా వాటిని వినియోగించినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె ఈ సందర్భంగా హెచ్చరించారు.



## రేవంత్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది

- **టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత**

ఉద్యమకారులతో పెట్టుకున్న ప్రభుత్వాలు నిలవలేదని వ్యాఖ్య మహిళల పట్ల పోలీసుల వ్యవహారంపై ఆగ్రహం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి వేడి రాజుకుంది.రాష్ట్ర ప్రభుత్వంపై టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర విమర్శలు గుప్పించారు. బోడుప్పల్‌లో ఉద్యమకారుల తరపున నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రజా సమస్యలపై గళమెత్తుతున్న ఉద్యమకారులను ప్రభుత్వం అణచివేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన 250 గజాల స్థలాన్ని వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, నిరసన కార్యక్రమాన్ని శాంతియుతంగా నిర్వహిస్తున్న సమయంలో పోలీసులు తమపై కక్షపూరితంగా వ్యవహరించి బలవంతంగా అక్కడి నుంచి ఈడ్చుకెళ్లారని ఆరోపించారు. మహిళా నాయకురాలిగా తన పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు తీవ్ర ఆందోళన కలిగించిందని పేర్కొన్నారు. మహిళలను ఈడ్చుకెళ్లాలని ఏ నిబంధనలో ఉందో రాష్ట్ర డీజీపీ ప్రజలకు సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య దేశంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిందని, అలాంటి హక్కులను కాలరాస్తూ ప్రభుత్వం వ్యవహరించడం సమంజసం కాదన్నారు. ఉద్యమాల ద్వారా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారుల గొంతు నొక్కే ప్రయత్నాలు ఏ ప్రభుత్వం చేసినా ప్రజలు సహించరని కవిత పేర్కొన్నారు. గతంలో ఉద్యమకారులతో విభేదించిన కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజల మద్దతు కోల్పోయాయని, అదే పరిస్థితి ప్రస్తుత ప్రభుత్వానికీ ఎదురయ్యే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలు, రైతులు, నిరుద్యోగులు, మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై దృష్టి సారించాల్సిన ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులు, ఉద్యమకారులపై పోలీసు చర్యలకు ప్రాధాన్యం ఇవ్వడం దురదృష్టకరమని ఆమె విమర్శించారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని, భిన్నాభిప్రాయాలను అణచివేయడం సరైన విధానం కాదని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ప్రజల అసంతృప్తి పెరుగుతోందని, అందుకే "ఈ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది" అని కవిత వ్యాఖ్యానించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలని, లేకపోతే ప్రజలే తగిన సమయంలో తీర్పు ఇస్తారని ఆమె హెచ్చరించారు. కాగా, ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ విమర్శలు మరింత వేడెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. వారి వెంట టిఆర్ఎస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు రాష్ట్ర నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ వైఖరిని ఖండించిన టిఆర్ఎస్ నాయకులు

**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో (డిడి 9 వార్త న్యూస్ )**

హైదరాబాదులోని ఉప్పల్ బాగాయత్ లో ఈరోజు ఉద్యమకారులకు 250 గజాల స్థలాన్ని కేటాయించాలని నిర్వహించిన ధర్నాలో ప్రభుత్వ తీరు, కవితక్క ను ఒక మహిళా అని చూడకుండా అరెస్టు చేసే విషయంలో లో ఈడ్చుకెళ్లిన పోలీసుల వైఖరి ఖండించాల్సిన విషయమని జిల్లా నాయకులు రంగినేని శ్రీనివాస్, వేణు, ప్రమోద్ అన్నారు. ప్రభుత్వం ప్రజల యొక్క హక్కులను కాలరాస్తుందని, ప్రశ్నించే ప్రజల నోరు ముయిస్తున్నారని అన్నారు ప్రభుత్వం వెంటనే అరెస్టు చేసిన టీఆరెఎస్ అధినేత్రి కవితక్క వారి అనుచరులను వెంటనే విడుదల చేసి క్షమాపణ చెప్పలని డిమాండ్ చేసారు




# పోలీస్ శాఖలో ఏసీబీ భారీ స్కెచ్

**మొదటిపేజీ తరువాయి**

కూడబెట్టారంటూ ఏసీబీ ప్రధాన కార్యాలయానికి గత కొంతకాలంగా అనేక ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు రహస్యంగా నిఘా ఉంచి, ఆయన సంపాదన మరియు లగ్జరీ జీవితంపై నమ్మదగిన సమాచారాన్ని సేకరించారు. ప్రాథమిక ఆధారాలు లభించడంతో పక్కా ప్లాన్‌తో రంగంలోకి దిగిన ప్రత్యేక ఏసీబీ బృందాలు, ఏకకాలంలో దాడులు చేసి ఆయన అక్రమ సామ్రాజ్యం గుట్టురట్టు చేసే పనిలో పడ్డాయి.

హైదరాబాద్ నగరంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన తారామతి బారామతి పరిసరాల్లో భీమ్ రెడ్డికి ఒక అత్యంత విలాసవంతమైన లగ్జరీ విల్లా ఉంది. గురువారం ఉదయం నుంచే ప్రత్యేక బృందాలు ఈ విల్లాను తమ ఆధీనంలోకి తీసుకుని అంగుళం అంగుళం వెతకడం ప్రారంభించాయి. కేవలం ఆయన ఇల్లే కాకుండా, ఆయనకు అత్యంత ఆప్తులుగా ఉన్న సన్నిహితులు, బంధువుల ఇళ్లను కూడా వదిలిపెట్టలేదు. హైదరాబాద్ మరియు దాని చుట్టుపక్కల జిల్లాల పరిధిలోని సుమారు పది ప్రాంతాలలో ఈ సోదాల పర్వం ఏకకాలంలో కొనసాగుతోంది.

ఇప్పటివరకు జరిగిన సోదాల్లో డీఎస్పీ భీమ్ రెడ్డి నివాసం నుండి కళ్లు చెదిరే స్థాయిలో అక్రమ సంపద బయటపడినట్లు తెలుస్తోంది. ఆయన ఇంట్లో పెద్ద ఎత్తున బంగారు నగలు, వజ్రాభరణాలు, వెండి వస్తువులను అధికారులు గుర్తించారు. వీటన్నింటికంటే ముఖ్యంగా పాతకాలపు నవాబుల తరహాలో భారీ పరిమాణంలో ఉన్న వెండి బిందెలను కూడా ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకోవడం గమనార్హం. ఈ ఆభరణాల బరువును, వాటి ప్రస్తుత మార్కెట్ విలువను లెక్కించేందుకు ప్రత్యేకంగా బరువులు తూచే వారిని పిలిపించారు.

అక్రమ ఆస్తులు, నగలతో పాటు భీమ్ రెడ్డి నివాసంలో ఎవరూ ఊహించని మరో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. సాధారణ నిబంధనల ప్రకారం ఇంట్లో ఉంచుకోవాల్సిన పరిమితికి మించి, భారీ మొత్తంలో విదేశీ మద్యం బాటిళ్లను అధికారులు కనుగొన్నారు. అత్యంత ఖరీదైన బ్రాండ్లకు సంబంధించిన ఈ మద్యం బాటిళ్లను నిబంధనలకు విరుద్ధంగా దాచి ఉంచడంతో, వాటిని కూడా ఏసీబీ అధికారులు సీజ్ చేశారు. ఈ విషయమై ఎక్సైజ్ శాఖ నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

భీమ్ రెడ్డి ఇంట్లో జరిపిన అన్వేషణలో లగ్జరీ విల్లాకు సంబంధించిన పత్రాలతో పాటు, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉన్న పలు విలువైన ఖాళీ స్థలాలు, వ్యవసాయ భూములకు సంబంధించిన ఒరిజినల్ ల్యాండ్ డాక్యుమెంట్లను ఏసీబీ బృందాలు స్వాధీనం చేసుకున్నాయి. ఇవన్నీ ఆయన పేరు మీద, అలాగే బినామీల పేర్ల మీద కొనుగోలు చేసినట్లు అధికారులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఈ భూముల రిజిస్ట్రేషన్ విలువకు, ప్రస్తుత బహిరంగ మార్కెట్ విలువకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని అధికారులు అంచనా వేస్తున్నారు. గురువారం ఉదయం ప్రారంభమైన ఈ ఏసీబీ సోదాలు ఇంకా నిరంతరాయంగా కొనసాగుతూనే ఉన్నాయి. ఇళ్లు, కార్యాలయాల్లోని లాకర్లు, అల్మారాలను అధికారులు పూర్తిగా తెరిచి చూస్తున్నారు. సోదాలు పూర్తిగా ముగిసేసరికి భీమ్ రెడ్డికి సంబంధించిన అక్రమాస్తుల నికర విలువ మరిన్ని కోట్ల రూపాయలలో తేలే అవకాశం ఉందని ఏసీబీ ఉన్నతాధికార వర్గాలు వెల్లడించాయి. బ్యాంక్ ఖాతాలు, నిలవ ఉన్న నగదు వివరాలను కూడా సేకరిస్తున్నారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ప్రధాన కార్యాలయంలోని కంప్యూటర్స్ వంటి సాంకేతిక విభాగంలో పనిచేస్తున్న ఒక డీఎస్పీ స్థాయి అధికారి ఇళ్లపై ఏసీబీ దాడులు జరగడం పోలీస్ శాఖలో తీవ్ర కలకలం రేపింది. తోటి ఉద్యోగులు, ఉన్నతాధికారులు ఈ దాడి వార్త విని విస్మయానికి గురవుతున్నారు. చట్టాన్ని రక్షించాల్సిన విభాగంలో ఉంటూ ఇంతటి అక్రమాలకు పాల్పడటంపై సర్వత్రా చర్చ నడుస్తోంది. త్వరలోనే ఏసీబీ అధికారులు ఈ దాడులకు సంబంధించిన పూర్తి వివరాలతో అధికారిక ప్రకటన విడుదల చేయనున్నారు.



## టీబీ రహిత సమాజమే లక్ష్యం

- **మేయర్ ఉమారాణి**

**నిజామాబాద్ జిల్లా జులై 02(డీడీ9 వార్త):**

క్షయ వ్యాధి లేని సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా 'టీబీ ముక్త్ భారత్ 2.0' కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేస్తున్నామని నిజామాబాద్ నగర మేయర్ ఉమారాణి పేర్కొన్నారు. గురువారం నిజామాబాద్ నగరంలోని 49వ డివిజన్ అరె కటిక సంఘం ప్రాంగణంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజశ్రీతో కలిసి ఆమె ప్రత్యేక టీబీ నిర్ధారణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. 2026 జూలై 2 నుంచి 2027 ఫిబ్రవరి 16వ తేదీ వరకు నగరంలోని అన్ని డివిజన్లలో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. రెండు వారాలకు పైగా దగ్గు, జ్వరం, ఆకస్మికంగా బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉన్న వారు ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. టీబీ పూర్తిగా నయం అయ్యే వ్యాధి అని, ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత ఎక్స్‌రే, వైద్య సేవలు, పౌష్టికాహార సహాయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.

**టీబీ ఛాంపియన్ల సన్మానం**

కార్యక్రమంలో భాగంగా టీబీ నుంచి కోలుకున్న వారికి 'టీబీ ఛాంపియన్' ధ్రువపత్రాలను మేయర్ అందజేశారు. వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ వారు పోషిస్తున్న పాత్రను ఆమె అభినందించారు. అలాగే, చికిత్స పొందుతున్న రోగులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ దేవి నాగేశ్వరి, వైద్యాధికారులు డాక్టర్ నవ్య, డాక్టర్ సుసేన, డాక్టర్ అజ్మతున్నిసా, పీఎంఓ రూప, హెల్త్ ఎడ్యుకేటర్ ఘన్‌పూర్ వెంకటేష్, కోఆర్డినేటర్లు రవి, లక్ష్మణ్, నరేష్, సూపర్‌వైజర్లు శ్యామల, విజయమాల తదితరులు పాల్గొన్నారు.



## స్మశానవాటికలో కొలువైన శివయ్య

**నిజామాబాద్ జిల్లా జులై 02(డీడీ9 వార్త):**

కమ్మర్ పల్లి మండలంలోని బషీరాబాద్ గ్రామ స్మశానవాటికలో గ్రామపంచాయతీ, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో శివుడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ విగ్రహాన్ని దాతలు 'ఆప్త మిత్ర సంఘం' సభ్యుల సహకారంతో ఏర్పాటు చేశారు. గ్రామంలోని స్మశానవాటికలో దైవ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంలో చొరవ చూపిన ఆప్త మిత్ర సంఘం సభ్యులకు గ్రామపంచాయతీ పాలకవర్గం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జమున మహేష్, ఉప సర్పంచ్ భూమేశ్వర్, పంచాయతీ కార్యదర్శి నవీన్ గౌడ్, వీడీసీ అధ్యక్షుడు పృథ్వీరాజ్, సదర్ రమేష్, వార్డు సభ్యులు రవి, సంఘ్యుత సంఘం, పటేల్ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్, అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల సమస్యలపై ఎంఈఓ కార్యాలయం వద్ద బీడీఎస్ఎఫ్ నిరసన

**బోధన్, నిజామాబాద్ జిల్లా జులై 02(డీడీ9 వార్త):**

ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీడీఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం బోధన్ పట్టణంలోని మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట ఆ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం విద్యాశాఖ కార్యాలయ అధికారికి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు సంజయ్ తల్లారే మాట్లాడుతూ.. నేడు ప్రభుత్వ పాఠశాలలు సమస్యలకు నిలయంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బడుల్లో కనీస సౌకర్యాలు లేవని, విద్యార్థులకు మరుగుదొడ్లు, మూత్రశాలల వసతి కూడా సరిగ్గా లేదని ఆయన విమర్శించారు. వర్షాకాలం దృష్ట్యా పాఠశాలల్లో సీజనల్ వ్యాధులకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని కోరారు. మండల కేంద్రంలోని మధుమలాంచ పాఠశాల ఆకతాయిలకు అడ్డాగా మారిందని, రాత్రి వేళల్లో అక్కడ మద్యం సీసాలు కనిపిస్తున్నాయని, అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయని ఆరోపించారు. సంబంధిత వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడంతో పాటు పాఠశాల ఆవరణకు ప్రహరీ నిర్మించి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 23 వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తామని ప్రకటించడం అన్యాయమని, ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సంజయ్ స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే చర్యలకు ప్రభుత్వం పాల్పడుతోందని ఆయన విమర్శించారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో పేద బహుజన విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించేలా పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న ఎంఈఓ పోస్టులతో పాటు టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు అందజేయాల్సిన 21 రకాల వస్తువుల కిట్‌తో పాటు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లను వెంటనే పంపిణీ చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అమలు చేయాలని కోరారు. విద్యాశాఖ అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి సమస్యలను గుర్తించాలని, హైస్కూళ్లలో ఉన్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బహుజన విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోధన్ పట్టణ అధ్యక్షులు శ్రీకిరణ్, కార్యదర్శి నరేందర్, జిల్లా నాయకులు రాజు, దీపక్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.




## వైద్యసేవల్లో అందరిదీ కీలక పాత్ర: డీఎంహెచ్ఓ రాజశ్రీ

**నిజామాబాద్ జిల్లా జులై 02(డీడీ9 వార్త):**

వైద్య వృత్తికి వెలకట్టలేని గౌరవం ఉందని, రోగులకు నాణ్యమైన సేవలు అందించడంలో వైద్యులతో పాటు పారామెడికల్, సాంకేతిక, మరియు కార్యాలయ సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రాజశ్రీ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జాతీయ వైద్యుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏవో సుమంత్ కుమార్ ఆధ్వర్యంలో డీఎంహెచ్ఓ కేక్ కట్ చేసి వైద్యులకు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నిబద్ధతతో పనిచేసే సిబ్బంది సహకారంతోనే వైద్యులు మెరుగైన సేవలను ప్రజలకు చేరువ చేయగలుగుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పీఓడీటీటీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ అంజన, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సికందర్ నాయక్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వెంకన్న, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ సుప్రియ, డాక్టర్ శిఖర, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ శ్రావ్య తదితరులను డీఎంహెచ్ఓ సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీఎంఓ రూప, డీహెచ్ఈ ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్లు వినయ్ కుమార్, హనుమాన్లు, షకీల్, డీపీఓ విశాల, శ్రీకాంత్, సందీప్, షోయబ్, వెంకటేష్, శ్రీనివాస్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

- **అశ్వారావుపేటలో లబ్ధిదారులకు రేషన్ కార్డుల పంపిణీ – మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు**

**అశ్వరావుపేట:జూలై :2(డిడి 9 వార్త)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారె ఆదినారాయణ ఆదేశాల మేరకు అర్హులైన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జూపల్లి రమేష్ బాబు లబ్ధిదారులకు రేషన్ కార్డులను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రేషన్ కార్డు అనేది కేవలం బియ్యం పొందేందుకు మాత్రమే కాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో అత్యంత కీలకమైన గుర్తింపు పత్రంగా ఉపయోగపడుతుందని అన్నారు. ప్రతి అర్హ కుటుంబానికి ఈ హక్కు అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు.

గత ప్రభుత్వ హయాంలో అనేక మంది అర్హులు రేషన్ కార్డులకు దూరమయ్యారని, దరఖాస్తులు చేసినప్పటికీ సంవత్సరాల తరబడి కార్డులు మంజూరు కాక ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి అర్హులను గుర్తించి పెద్దఎత్తున కొత్త రేషన్ కార్డులను మంజూరు చేస్తోందని తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, అర్హులైన ఒక్క కుటుంబం కూడా ప్రభుత్వ పథకాలకు దూరం కాకుండా చర్యలు తీసుకుంటోందని చెప్పారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని వివరించారు.

అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ఎమ్మెల్యే జారె ఆదినారాయణ లక్ష్యమని జూపల్లి రమేష్ బాబు పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారని, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇతర సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని తెలిపారు.రేషన్ కార్డులు లేని అర్హ కుటుంబాలు ఇకపై ప్రభుత్వ సంక్షేమానికి దూరం కాకుండా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ప్రజలు తమకు సంబంధించిన సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకురావాలని, ప్రభుత్వం ప్రజల పక్షాన నిలబడి ప్రతి సమస్యకు పరిష్కారం చూపేందుకు సిద్ధంగా ఉందన్నారు.

రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వానికి, ఎమ్మెల్యే జారె ఆదినారాయణకు, మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న తమకు రేషన్ కార్డులు అందడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఇకపై ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలను సులభంగా పొందగలమని వారు తెలిపారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చిన్నంశెట్టి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల యూత్ నాయకుడు జూపల్లి ప్రమోద్, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు నండ్రు రమేష్, అల్లాడి వెంకట రామారావు, కౌన్సిలర్లు మిండా హరిబాబు, తిరుమలశెట్టి వెంకన్నబాబు, నార్లపాటి దివాకర్, షేక్ సైదు బాజీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా చెట్టుపల్లి నియామకం

- **కష్టానికి ఫలితం దక్కింది**
- **ప్రజా సమస్యల పరిష్కారమే నా మొదటి ప్రాధాన్యత:**

**మంగపేట, జూలై 02డీడీ 9 వార్త**

మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా చెట్టుపల్లి వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర మరియు జిల్లా కాంగ్రెస్ నాయకత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. వెంకటేశ్వర్లు నియామకం పట్ల మండలవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ శ్రేణులు, అనుబంధ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**పార్టీలో నూతన ఉత్తేజం:**

వెంకటేశ్వర్లు నియామకం మండల కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆయన నివాసానికి చేరుకుని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంలో వెంకటేశ్వర్లుకు ఉన్న పట్టు, కార్యకర్తలను కలుపుకునిపోయే గుణం పార్టీకి ఎంతో కలిసివస్తుందని నేతలు అభిప్రాయపడ్డారు.

**ప్రజల గొంతుకగా ఉంటాను**

ఈ సందర్భంగా చెట్టుపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, తనపై నమ్మకంతో మండల అధ్యక్షునిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ జిల్లా మరియు రాష్ట్ర అగ్రనేతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ, "మండలంలో కాంగ్రెస్ పార్టీని ప్రతి గడపకు తీసుకెళ్తాను. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్క అర్హుడైన పేదవాడికి చేరేలా చూడటమే నా బాధ్యత. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతాను. మండల సర్వతోముఖాభివృద్ధికి, నిరుద్యోగ యువత మరియు రైతులకు అండగా ఉండటమే లక్ష్యంగా పనిచేస్తాను," అని స్పష్టం చేశారు.

**కార్యకర్తలే పార్టీకి ప్రాణం**

పార్టీ కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో మండలంలో జరగబోయే అన్ని రాజకీయ కార్యక్రమాలను దిగ్విజయం చేస్తామని, పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి మండలంలోని ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# విద్యార్థుల రవాణాలో నిర్లక్ష్యం వద్దు

- **ఎంవీఐ మణికాంత్**
- **బోధన్‌లో స్కూలు బస్సుల తనిఖీ**

**బోధన్, నిజామాబాద్ జిల్లా జులై 02(డీడీ9 వార్త):**

విద్యార్థుల రవాణాలో భద్రతను పర్యవేక్షించేందుకు మోటార్ వాహనాల శాఖ అధికారులు గురువారం బోధన్‌లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలనే సంకల్పంతో ఈ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, దీనిలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా స్కూలు బస్సుల ఫిట్‌నెస్, భద్రతా ప్రమాణాలు, అవసరమైన అనుమతులు మరియు డ్రైవర్ల అర్హతలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్, ఫైర్ ఎమర్జెన్సీ కిట్ మరియు ఫస్ట్ ఎయిడ్ కిట్ లేని బస్సుల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నామని, నిబంధనలను ఉల్లంఘించిన కొన్ని బస్సులకు జరిమానాలు విధించడంతో పాటు మరికొన్నింటిని సీజ్ చేశామని అధికారులు తెలిపారు. ప్రతి స్కూలు బస్సు డ్రైవర్‌కు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని ప్రతి మూడు నెలలకు ఒకసారి మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను తప్పనిసరిగా కలిగి ఉండాలని మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ మణికాంత్ వెల్లడించారు. విద్యార్థుల భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, నిబంధనలు పాటించని పాఠశాల యాజమాన్యాలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



# బోధన్‌లో నేడు 'వరుణ మహా యాగం'

**బోధన్, నిజామాబాద్ జిల్లా జులై 02(డీడీ9 వార్త):**

సుభిక్ష వర్షాల కోసం యోగ్ ధారణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం బోధన్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో వరుణ మహా యాగం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఉదయ్ మహారాజ్ పర్యవేక్షణలో వేద పండితులు ఈ యాగ కార్యక్రమాలను చేపట్టనున్నారు. వాతావరణ సమతుల్యత కోసం చేపట్టే ఈ కార్యక్రమంలో భాగంగా గణపతి పూజ, వరుణ దేవత ఆవాహన, మహా వరుణ హోమం, గోపూజలు నిర్వహించనున్నారు. కార్యక్రమానికి విచ్చేసే భక్తుల కోసం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని యజ్ఞాన్ని జయప్రదం చేయాలని కోరారు. వివరాల కోసం 8019044004 ఫోన్ నంబరులో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.




# విద్యార్థుల కలలకు మెరుగైన తోడ్పాటు

- **పెన్షనర్ల భవనంలో ప్రత్యేక రీడింగ్ రూమ్ ప్రారంభం**

**నిజామాబాద్ జిల్లా జులై 02(డీడీ9 వార్త):**

పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఆహ్లాదకరమైన, ప్రశాంతమైన వాతావరణం కల్పించాలన్న సంకల్పంతో జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ ఒక గొప్ప నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే గ్రంథాలయంలో ఉన్న రద్దీని దృష్టిలో ఉంచుకుని, అభ్యర్థుల సౌకర్యం కోసం నూతనంగా ప్రత్యేక 'రీడింగ్ రూమ్'ను అందుబాటులోకి తీసుకువచ్చింది. జిల్లా కేంద్ర గ్రంథాలయానికి సమీపంలో ఉన్న పెన్షనర్స్ అసోసియేషన్ భవనాన్ని విద్యార్థుల చదువుల కోసం కేటాయించాలని గ్రంథాలయ సంస్థ కోరగా, పెన్షనర్స్ అసోసియేషన్ కార్యవర్గం సానుకూలంగా స్పందించింది. విద్యార్థుల భవిష్యత్తు కోసం తమ భవనాన్ని కేటాయించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. గురువారం జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు అంత రెడ్డి రాజి రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని రీడింగ్ రూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు అంత రెడ్డి రాజి రెడ్డి మాట్లాడుతూ.. సమాజ హితం కోసం పెన్షనర్స్ అసోసియేషన్ తీసుకున్న నిర్ణయం ఆదర్శనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పండరినాథ్ మాట్లాడుతూ.. గ్రంథాలయ పాఠకులకు వసతులు కల్పించడంలో తమ వంతు సహకారం అందిస్తున్నందుకు గర్వంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి భవనాన్ని కేటాయించినందుకు గాను గ్రంథాలయ సంస్థ తరఫున పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గంగా కిషన్, సలహాదారులు రాజారాం, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

# కస్తూర్బా పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- **అపరిశుభ్రతపై ఆగ్రహం**

**బోధన్, నిజామాబాద్ జిల్లా జులై 02(డీడీ9 వార్త):**



రెంజల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని గురువారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అకస్మాత్తుగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ అపరిశుభ్రంగా ఉండటంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల భద్రతను గమనించి, పరిసరాలను వెంటనే శుభ్రం చేయించాలని, ఆర్‌ఓ ప్లాంట్ మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలని బయటి వ్యక్తుల రాకపై ఆంక్షలు విధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రవణ్, ఎంపీడీఓ కమలాకర్, స్పెషల్ ఆఫీసర్ శ్యామల పాల్గొన్నారు.

# విద్యాసంస్థలపై దాడులు చేస్తే క్రిమినల్ కేసులే

- **సీపీ సాయి చైతన్య**

**నిజామాబాద్ జిల్లా జులై 02(డీడీ9 వార్త):**



విద్యాసంస్థల నిర్వహణకు ఆటంకం కలిగిస్తూ, చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే విద్యార్థి సంఘాల నాయకులపై కఠిన చర్యలు తప్పవని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య హెచ్చరించారు. కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలోని విద్యాసంస్థల్లోకి విద్యార్థి సంఘాలు యాజమాన్యాల అనుమతి లేకుండా ప్రవేశించి, పుస్తకాల విక్రయాలు లేదా వసతుల లేమి వంటి కారణాలతో అలజడి సృష్టిస్తూ సిబ్బందిని, విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి ఫిర్యాదులపై స్పందించిన పోలీసులు ఇప్పటికే చట్టపరమైన చర్యలు ప్రారంభించారని, కేశపూర్ మరియు బర్దిపూర్ శివారులోని నారాయణ విద్యాసంస్థపై దాడి చేసి ఆస్తులను ధ్వంసం చేసిన ఘటనలో డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదు చేశామని తెలిపారు. వర్ని పోలీస్ స్టేషన్ పరిధిలోని చందూరులో ఉన్న శ్రీ సాయి విద్యాలయంలోకి ప్రవేశించి సిబ్బందిని బెదిరించిన ఘటనలో కూడా క్రిమినల్ కేసు నమోదు చేశామన్నారు. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం విద్యాసంస్థలను బంద్ చేయించే హక్కు ఎవరికీ లేదని, అలా ఎవరైనా ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ స్పష్టం చేశారు. నిందితులపై గతంలో ఏవైనా కేసులు ఉంటే, వాటిని పరిగణనలోకి తీసుకుని అదనపు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విద్యాసంస్థల సమస్యలపై విద్యార్థి సంఘాలు నేరుగా దాడులు చేయకుండా, సంబంధిత విద్యాశాఖ అధికారులకు లేదా జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. నిబంధనల ప్రకారం విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని, విద్యార్థుల చదువుకు ఆటంకం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని కమిషనర్ సాయి చైతన్య స్పష్టం చేశారు.

# ఈ నెల 10న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయండి

- **వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు**

**నిజామాబాద్ జిల్లా జులై 02(డీడీ9 వార్త):**

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 10న చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, పీడీఎస్‌యూ, ఏఐఎఫ్‌ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. నిజామాబాద్ సుభాష్‌నగర్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. విద్యాశాఖకు ఇప్పటి వరకు మంత్రిని నియమించకపోవడం దురదృష్టకరమని, 24 వేల ప్రభుత్వ పాఠశాలల విలీన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు చట్టం తీసుకురావాలని, పెండింగ్‌లో ఉన్న రూ. 9 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని వారు కోరారు. గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో యూనిఫాం, పుస్తకాలను వెంటనే పంపిణీ చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. నూతన విద్యా విధానం 2020ని రాష్ట్రంలో అమలు చేయకూడదని, యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుబోధ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కల్ప గణేష్, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు వినోద్, ఏఐఎఫ్‌ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్, మనోజ్, శ్రీకర్, రాజు, కిషోర్, గిరీష్, శివ, అశన్, సునీల్, సూర్యపాల్, సుమన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.





# నిరుద్యోగులకు ఉపాధి కల్పన ప్రభుత్వ ప్రాధాన్యం

- **ఎమ్మెల్యే భూపతిరెడ్డి**

**నిజామాబాద్ జిల్లా జులై 02(డీడీ9 వార్త):**

జిల్లా ఉపాధి కల్పన శాఖ, టామ్‌కామ్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్థానిక వర్ని చౌరస్తా సమీపంలోని జనార్ధన్ గార్డెన్స్‌లో నిర్వహించిన విదేశీ, స్వదేశీ ఉద్యోగ మేళా విజయవంతమైంది. ఐదు వేలకు పైగా నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్న ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారుల హాజరుతో సందడి నెలకొంది. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతిరెడ్డి, నగర మేయర్ ఉమారాణి, ఉపాధి కల్పన శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ, కలెక్టర్ ఇలా త్రిపాఠి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి కల్పనలో భాగంగా వినూత్న కార్యక్రమాలు చేపడుతోందని, అందులో భాగంగానే స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. విదేశీ ఉద్యోగాలకు వెళ్లే యువత భయాందోళన చెందకుండా ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కొత్త పాలసీని తీసుకురావడానికి సిద్ధంగా ఉందని ఆయన వివరించారు. జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అతిథులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి వేల్పుల విజేత, క్రీడల అభివృద్ధి అధికారి పవన్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# జూన్‌లో 94,849 మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి చేసిన ఆర్ఎఫ్‌సీఎల్

- **వివిధ రాష్ట్రాలకు 97,094 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా**
- **ఉత్పత్తి లక్ష్యాల సాధనలో ఉద్యోగుల కృషి అభినందనీయం: యూనిట్ హెడ్ ఎస్.కె. జిందాల్**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 02 (డీడీ9 వార్త):**

రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్) జూన్-2026 నెలకు సంబంధించిన యూరియా ఉత్పత్తి, సరఫరా వివరాలను విడుదల చేసింది. యూనిట్ హెడ్ ఎస్.కె. జిందాల్ ఈ వివరాలను ప్రకటించారు.
జూన్ నెలలో ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంట్ 94,849 మెట్రిక్ టన్నుల వేపపూత (నీమ్ కోటెడ్) యూరియాను ఉత్పత్తి చేయగా, 97,094.70 మెట్రిక్ టన్నుల యూరియాను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు సరఫరా చేసింది. ఇందులో తెలంగాణకు 48,675.33 మెట్రిక్ టన్నులు, ఆంధ్రప్రదేశ్‌కు 11,308.23 మెట్రిక్ టన్నులు, కర్ణాటకకు 28,338.66 మెట్రిక్ టన్నులు, తమిళనాడుకు 5,655.60 మెట్రిక్ టన్నులు, మహారాష్ట్రకు 3,116.88 మెట్రిక్ టన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూనిట్ హెడ్ ఎస్.కె. జిందాల్ మాట్లాడుతూ..., ఉత్పత్తి, సరఫరా లక్ష్యాల సాధనలో కృషి చేసిన ఉద్యోగులు, కార్మికులు, అధికారులను అభినందించారు. అలాగే కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖతో పాటు తెలంగాణ ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.




# నిరుద్యోగ యువతకు సింగరేణి చేయూత.. 14 మందికి ఉద్యోగ అవకాశాలు

- **ఆర్జీ-1 స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంలో ప్రత్యేక ఇంటర్వ్యూలు విజయవంతం**
- **ఐటీఐ అప్రెంటిస్‌లకు ఉద్యోగాలు.. మహిళలకు కిమ్స్‌లో శిక్షణతో ఉపాధి**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 02 (డీడీ9 వార్త):**

సింగరేణి రామగుండం ఏరియా-1 జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ నేతృత్వంలో స్థానిక స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక ఇంటర్వ్యూలు విజయవంతమయ్యాయి. ఈ ఇంటర్వ్యూల ద్వారా మొత్తం 14 మంది అభ్యర్థులు ఉద్యోగ, శిక్షణా అవకాశాలకు ఎంపికయ్యారు.
ఆర్జీ-1 ఏరియాలో ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్‌షిప్ పూర్తి చేసిన అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా ఇంటర్వ్యూలు నిర్వహించగా, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సంస్థ ట్రాన్స్‌పరెంట్ కార్పొరేట్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ చేపట్టి 14 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు.
అదే విధంగా మహిళా అభ్యర్థుల కోసం కిమ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాన్‌టెక్నికల్ విభాగాల్లో ప్రత్యేక శిక్షణ-ఉపాధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపికైన మహిళలకు హైదరాబాద్‌లో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ అందించి, అనంతరం ప్రముఖ కిమ్స్ ఆస్పత్రిలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.
ఈ సందర్భంగా ఆర్జీ-1 జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ మాట్లాడుతూ.... సింగరేణి సంస్థ నిరుద్యోగ యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇలాంటి ఉచిత శిక్షణ, ఉపాధి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తోందని తెలిపారు. ప్రాంతీయ యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ టు జీఎం చంద్రశేఖర్, ఎస్‌డీటీసీ మేనేజర్ మాదవరెడ్డి, సీనియర్ పీవో శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొని ఎంపికైన అభ్యర్థులను అభినందించారు.




# పశువుల అక్రమ రవాణా

- **ముగ్గురిని అదుపులోకి తీసుకున్న దుమ్ముగూడెం పోలీసులు**

**జూలై 2 డిడి 9 వార్త దుమ్ముగూడెం**

దుమ్ముగూడెం మండలం ములకపాడు కూడలి వద్ద వాహన తనిఖీల్లో 12 పశువులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని గురువారం పోలీసులు పట్టుకున్నారు. నంబర్‌ప్లేట్ లేని వాహనంలో చర్ల నుంచి పండితాపురం వైపు పశువులను తరలిస్తున్నట్లు గుర్తించారు. పాల్వంచకు చెందిన షేక్ కాశీం, షేక్ హన్ను, డ్రైవర్ వంశీలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యాంప్రసాద్ తెలిపారు.




# ఎన్‌టీపీసీ లో రియల్‌సైజ్ ఎల్‌టీ స్విచ్‌గేర్ శిక్షణ మాడ్యూల్ ప్రారంభం

- **జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాల సందర్భంగా ఉద్యోగులకు ఆధునిక శిక్షణా వేదిక**
- **ప్రాక్టికల్ శిక్షణతో విద్యుత్ భద్రత, సాంకేతిక నైపుణ్యాల పెంపుదలకు ఎన్‌టీపీసీ మరో అడుగు**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 02 (డీడీ9 వార్త):**

జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాల సందర్భంగా ఎన్‌టీపీసీ తెలంగాణ ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్ విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన రియల్‌సైజ్ లో టెన్షన్ స్విచ్‌గేర్ శిక్షణ మాడ్యూల్‌ను గురువారం ప్రారంభించారు.
ఈ శిక్షణా కేంద్రాన్ని తెలంగాణ సీజీఎం (ఓ అండ్ ఎం) ముకుల్ రాయ్ ప్రారంభించగా, జీఎం (మెయింటెనెన్స్ & అడ్మినిస్ట్రేషన్) అవిజిత్ దత్తా పాల్గొన్నారు. ఈ మాడ్యూల్‌లో పూర్తి స్థాయి ఎల్‌టీ స్విచ్‌గేర్ ప్యానెల్‌తో పాటు ఎల్‌టీ సర్క్యూట్ బ్రేకర్, స్విచ్ ఫ్యూజ్ యూనిట్, మోల్డెడ్ కేస్ సర్క్యూట్ బ్రేకర్ వంటి కీలక పరికరాలను ఏర్పాటు చేశారు.
ఆపరేషన్ ఇంజినీర్లు, ఆపరేటర్లు, ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్ సిబ్బంది కోసం రూపొందించిన ఈ శిక్షణా మాడ్యూల్ ద్వారా పరికరాల అంతర్గత నిర్మాణం, పనితీరు, భద్రతా ప్రమాణాలు, లోపాల గుర్తింపు, నిర్వహణ విధానాలపై ప్రత్యక్ష అనుభవంతో కూడిన శిక్షణ అందించనున్నారు.



ఈ మాడ్యూల్ సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు విద్యుత్ భద్రతపై ఉద్యోగుల్లో అవగాహనను మరింత బలోపేతం చేస్తుందని అధికారులు తెలిపారు. ఉద్యోగుల సామర్థ్యాభివృద్ధి, భద్రతా సంస్కృతి, సాంకేతిక ఆవిష్కరణలకు ఎన్‌టీపీసీ తెలంగాణ నిరంతరం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.



# మేడిపల్లి ఓపెన్‌కాస్ట్‌లో చేపల చెరువుల పునరుద్ధరణకు శ్రీకారం

- **నిరుద్యోగ మత్స్యకారులు, యువతకు ఉపాధి కల్పనపై కలెక్టర్ కోయ శ్రీహర్ష దృష్టి**
- **ఓబీ డంప్ నీటి వనరుల సద్వినియోగానికి సింగరేణికి కీలక సూచనలు**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 02 (డీడీ9 వార్త):**

పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం మేడిపల్లి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టును సందర్శించి, ఓబీ డంప్ ప్రాంతాల్లోని నీటి వనరులు, చేపల చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా వృథాగా ఉన్న చేపల చెరువులను పునరుద్ధరించి చేపల పెంపకానికి వినియోగించాలని అధికారులను ఆదేశించారు.
చేపల చెరువులను అభివృద్ధి చేయడం ద్వారా స్థానిక నిరుద్యోగ మత్స్యకారులు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ మత్స్యాభివృద్ధి కార్యక్రమాలకు అనుగుణంగా ఓబీ డంప్ ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేసుకుని చేప పిల్లలను వదిలి చేపల పెంపకాన్ని ప్రోత్సహించాలని సూచించారు.
చేపల పెంపకం, నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వ నిబంధనల మేరకు కాంట్రాక్టు విధానం లేదా అర్హత కలిగిన మత్స్యకార సహకార సంఘాలకు టెండర్ ప్రక్రియ ద్వారా అప్పగించే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. దీంతో స్థానిక మత్స్యకారులకు ఉపాధి కల్పించడంతో పాటు నీటి వనరుల సమర్థ వినియోగం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.
ఈ సందర్భంగా రామగుండం ఏరియా-1 జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ మాట్లాడుతూ..... కేంద్ర ప్రభుత్వ నిధులతో గతంలో నిర్మించిన చేపల చెరువులను తిరిగి వినియోగంలోకి తీసుకురావడానికి అవసరమైన ప్రతిపాదనలను సింగరేణి కార్పొరేట్ కార్యాలయానికి అనుమతుల కోసం పంపనున్నట్లు తెలిపారు.
ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా అధికారి పి. నరేష్ కుమార్ నాయుడు, ఏజెంట్ లక్కిడి రమేష్, ఎస్టేట్ డీజీఎం కుమారస్వామి, ఏరియా సర్వే ఆఫీసర్ లక్ష్మీరాజం, ఫారెస్ట్ డీజీఎం కర్ణ, మేనేజర్ మల్లికార్జున్ యాదవ్ తదితర అధికారులు పాల్గొన్నారు.



# సింగరేణి అధికారులకు పీఆర్పీ ఇవ్వడంలో నిర్లక్ష్యం తగదు: చల్ల నారాయణరెడ్డి

- **సీఎంఓఏఐ రిలే నిరాహార దీక్షలకు బీజేపీ సంఘీభావం**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 02 (డీడీ9 వార్త):**

సింగరేణి ఆర్జీ-3 ప్రాంతంలో నాలుగో రోజు కొనసాగుతున్న సీఎంఓఏఐ అధికారుల రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్ల నారాయణరెడ్డి సందర్శించి సంఘీభావం తెలిపారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... సింగరేణి అధికారులకు రావాల్సిన పీఆర్పీని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉంచడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. లాభాల్లో ఉన్న సంస్థ నుంచి ప్రభుత్వాలు వాటా తీసుకుంటున్నప్పటికీ, సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్న అధికారుల న్యాయమైన హక్కులను అమలు చేయడంలో నిర్లక్ష్యం చూపడం బాధాకరమన్నారు.
అధికారులతో వెంటనే చర్చలు జరిపి పీఆర్పీ విడుదల చేయాలని డిమాండ్ చేసిన ఆయన, ఈ సమస్యను కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా బీజేపీ తరఫున కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, సీఎంఓఏఐ ప్రతినిధులు, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.




# విషాదంలో ఉన్న కుటుంబానికి అండగా వ్యాల్ల హరీష్ రెడ్డి

- **రూ.10 వేల ఆర్థిక సాయం అందజేసి పరామర్శ**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 02 (డీడీ9 వార్త):**

రామగుండం నియోజకవర్గం గోదావరిఖని మార్కండేయ కాలనీ శ్రీ బాలాజీ నగర్‌కు చెందిన రెడ్డిమల్ల సాత్విక్ కుటుంబాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వ్యాల్ల హరీష్‌రెడ్డి పరామర్శించారు. కుటుంబ పెద్ద రెడ్డిమల్ల ఈశ్వర్, అనంతరం ఐదు నెలల వ్యవధిలో తమ్ముడు రీత్విక్ మృతి చెందడంతో తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కష్టకాలంలో బీఆర్ఎస్ పార్టీ కుటుంబానికి అండగా ఉంటుందని, భవిష్యత్తులోనూ అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.



# ఓటరు జాబితా ప్రక్షాళనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్

- **స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్.ఐ.ఆర్ పురోగతిపై బీఎల్‌వోలతో సమీక్ష సమావేశం**
- **అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచన**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 02 (డీడీ9 వార్త):**

ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ అన్నారు. ఎన్‌టీపీసీలోని కాకతీయ కళాతోరణంలో బీఎల్‌వోలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసి, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, బీఎల్ఏలు, స్వచ్ఛంద సేవకులు బీఎల్‌వోలకు సహకరించాలని కోరారు. సమావేశంలో మేయర్ మహంకాళి స్వామి, అదనపు కలెక్టర్ జె. అరుణశ్రీ, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



# విద్యుత్ భద్రతపై మహిళలకు అవగాహన కల్పించిన ఎన్టీపీసీ తెలంగాణ

- **జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాల సందర్భంగా దీప్తి మహిళా సమితిలో అవగాహన కార్యక్రమం**
- **క్విజ్ పోటీలతో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 02 (డీడీ9 వార్త):**

జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాల సందర్భంగా ఎన్టీపీసీ తెలంగాణ ఈఎండీ (ఆర్&టీ) విభాగం ఆధ్వర్యంలో టౌన్‌షిప్ మహిళల కోసం విద్యుత్ భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని దీప్తి మహిళా సమితి లో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఈఎండీ విభాగానికి చెందిన ఏజీఎం సునీల్ అగ్రవాల్, డీజీఎం పి. విశ్వనాథ్ నిర్వహించారు. ఇంటి వద్ద విద్యుత్ పరికరాలను సురక్షితంగా వినియోగించడం, విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విద్యుత్ లోపాలను వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాల్సిన అవసరంపై వారు వివరంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన విద్యుత్ భద్రతా క్విజ్ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ క్విజ్ ద్వారా విద్యుత్ భద్రతకు సంబంధించిన కీలక అంశాలపై అవగాహన పెంపొందించడంతో పాటు కుటుంబాలు, పరిసర ప్రాంతాల్లో భద్రతా సందేశాన్ని విస్తరించేలా ప్రోత్సహించారు.
కృతజ్ఞతా ప్రసంగంతో కార్యక్రమం ముగిసింది. టౌన్‌షిప్‌లో విద్యుత్ భద్రతపై అవగాహన పెంపొందించి, సురక్షిత జీవన వాతావరణం కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని ఎన్టీపీసీ తెలంగాణ అధికారులు తెలిపారు.









# ఎన్టీపీసీలో జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాలకు ముగింపు

- **జీరో ఎలక్ట్రికల్ ప్రమాదాలు**
- **జీరో హార్మ్ వర్క్‌ప్లేస్**
- **జీరో ఎలక్ట్రికల్ ఫైర్స్' లక్ష్యంగా భద్రతా సంస్కృతికి మరింత బలోపేతం**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 02 (డీడీ9 వార్త):**

ఎన్టీపీసీలో జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాల ముగింపు సందర్భంగా హెచ్‌ఆర్ ఆడిటోరియంలో గురువారం వాలెడిక్టరీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వారం రోజుల పాటు విద్యుత్ నిర్వహణ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యుత్ భద్రతా అవగాహన, శిక్షణ కార్యక్రమాలకు ఈ కార్యక్రమంతో ముగింపు పలికారు.
ఈ కార్యక్రమానికి తెలంగాణ సీజీఎం (ఓ అండ్ ఎం) ముకుల్ రాయ్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, రామగుండం జీఎం (ఓ అండ్ ఎం) మనీష్ అగర్వాల్, జీఎం (ఎం అండ్ ఏడీఎం) అవిజిత్ దత్తా, జీఎం (ప్రాజెక్ట్స్) బినోయ్ జోష్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ భాగస్వాములు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు. వారోత్సవాల సందర్భంగా ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, దీప్తి లేడీస్ క్లబ్ సభ్యుల కోసం నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో అన్ని వర్గాల నుంచి ఉత్సాహభరితమైన భాగస్వామ్యం విద్యుత్ భద్రతపై పెరుగుతున్న అవగాహనకు నిదర్శనంగా నిలిచింది.
ఈ సందర్భంగా సీజీఎం ముకుల్ రాయ్ మాట్లాడుతూ... విద్యుత్ భద్రత అనేది విద్యుత్ కేంద్రాలకే పరిమితం కాదని, కార్యాలయాలు, టౌన్‌షిప్‌లు, గృహాల్లో కూడా సమానంగా పాటించాల్సిన బాధ్యత అని అన్నారు. కనిపించని విద్యుత్ ప్రమాదాలకు అప్రమత్తత, అవగాహన, భద్రతా నిబంధనల కచ్చితమైన అమలే రక్షణ కవచమని పేర్కొన్నారు. ఎన్టీపీసీ భద్రతా లక్ష్యాలైన 'జీరో ఎలక్ట్రికల్ ప్రమాదాలు - జీరో హార్మ్ వర్క్‌ప్లేస్ - జీరో ఎలక్ట్రికల్ ఫైర్స్' సాధనకు సంస్థ కట్టుబడి ఉందని ఈఎండీ బృందం పునరుద్ఘాటించింది.
వారం రోజుల పాటు విద్యుత్ భద్రతపై అవగాహన సదస్సులు, ప్రత్యక్ష ప్రదర్శనలు, క్విజ్‌లు, శిక్షణ కార్యక్రమాలు, టౌన్‌షిప్ ప్రజలకు అవుట్‌రీచ్ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యుత్ భద్రతను ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగంగా మార్చే దిశగా కృషి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. చివరగా కృతజ్ఞతా ప్రసంగంతో కార్యక్రమం ముగియగా, విద్యుత్ భద్రతా ప్రమాణాలను మరింత బలోపేతం చేస్తూ సురక్షితమైన కార్యాచరణ సంస్కృతిని కొనసాగించాలని అన్ని వర్గాలు సంకల్పం వ్యక్తం చేశాయి.


# ప్రాణాలతో చెలగాటం విద్యుత్ ఉద్యోగుల విధి నిర్వహణ..

- **ప్రజలకు అసౌకర్యం కలగకుండా నిరంతరం శ్రమిస్తున్న విద్యుత్ శాఖ లైన్ మెన్ లు..**

**మణుగూరు.జూలై 2 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు మండలం లోని విద్యుత్ శాఖకు చెందిన ఉద్యోగులు (లైన్ మెన్ లు) ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిరంతరం శ్రమిస్తున్న విధానం చూసి వారిని అభినందిస్తున్నారు.రాత్రనకా,పగలనకా ఏ కాలమైనా కరెంట్ పోయింది అని ఫోన్ వచ్చిన వెంటనే, వారు ఏ పరిస్థితుల్లో ఉన్నా వెంటనే ఆ ప్రాంతానికి వెళ్ళి సమస్యను తెలుసుకుని దానిని పరిష్కరించే వరకు విశ్రమించకుండా పనిచేసే విద్యుత్ ఉద్యోగులకు హాట్సాఫ్ చెప్పాల్సిందే.వర్షాకాలం వచ్చిందంటే వారి బాధలు వర్ణనాతీతం. భారీ వర్షాలు,విపరీతమైన గాలి దుమారాలు, చెట్లు విరిగి కరెంట్ తీగలపై పడటం,స్థంభాలు విరిగిపోవడం వంటి విపత్కర పరిస్థితుల్లో కరెంటును పునరుద్ధరించడానికి వారు చూపే పోరాట పటిమను ఎంత పొగిడినా తక్కువే. ఇంత చేసినా వారికి వచ్చే అభినందనల కన్నా ,అవమానాలే ఎక్కువ. కొన్ని కొన్ని సందర్భాలలో.. ప్రత్యేకంగా రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు కనీసం వారికి సమస్య ఎక్కడ ఉందో తెలుసుకునే సమయం కూడా ఇవ్వకుండా ఎంతో మంది ఫోన్ లు చేసి ఎలా మాట్లాడుతారో తెలియని విషయం కాదు. ఎవరు ఎన్ని మాట్లాడినా,దూషించిన తమ బాధ్యతను శ్రద్ధగా నిర్వర్తించే విద్యుత్ ఉద్యోగులను గౌరవిద్దాం.గురువారం నాడు మణుగూరు మండలం,కూనవరం గ్రామ పంచాయతీ పరిధిలో విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం కలిగిస్తున్న చెట్ల కొమ్మలను తొలగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో లైన్ మెన్ లు శ్రీనివాసరావు,వెంకటేశ్వరరావు లు పాల్గొని ఎంతో చాకచక్యంతో తమ విధులను నిర్వర్తించారు.కొన్ని సందర్భాల్లో వారి ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి విధి నిర్వహణ చేయవలసిన పరిస్థితి ఎదురవుతుంది. అయినా కూడా లెక్కచేయకుండా ప్రజల సౌకర్యం కోసం తమ డ్యూటీ చేస్తారు. అందుకే వారిని గౌరవిద్దాం, వారి కష్టాన్ని గుర్తిద్దాం.







# కిన్నెరసాని,కాచినపల్లి గిరిజన మోడల్ స్పోర్ట్స్ పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలి..

- **ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వినతి.**

**మణుగూరు.జూలై 2(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ని కలిసి భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని కిన్నెరసాని (బాలుర), కాచినపల్లి (బాలికలు) ప్రభుత్వ గిరిజన సంక్షేమ మోడల్ స్పోర్ట్స్ పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా (ఇంటర్మీడియట్ స్థాయికి) అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 201819 విద్యా సంవత్సరంలో ప్రారంభమైన కిన్నెరసాని, కాచినపల్లి గిరిజన మోడల్ స్పోర్ట్స్ పాఠశాలలు గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రీడల్లో అత్యుత్తమ శిక్షణ అందిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక విజయాలను సాధించాయని తెలిపారు. ఈ పాఠశాలల విద్యార్థులు తెలంగాణకు మంచి గుర్తింపు తీసుకొచ్చారని పేర్కొన్నారు. అయితే, ఈ విద్యాసంస్థల్లో జూనియర్ కళాశాలలు లేకపోవడం వల్ల పదో తరగతి పూర్తయిన తర్వాత విద్యార్థులు తమ విద్యతో పాటు క్రీడా శిక్షణను కొనసాగించలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీంతో ఎంతో మంది ప్రతిభావంతులైన గిరిజన క్రీడాకారులు మధ్యలోనే చదువును, క్రీడలను వదిలివేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికే ఈ పాఠశాలల్లో అవసరమైన క్రీడా మౌలిక సదుపాయాలు, అనుభవజ్ఞులైన కోచ్‌లు అందుబాటులో ఉన్నందున, వీటిని జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తే గిరిజన విద్యార్థులు ఇంటర్మీడియట్ విద్యను అభ్యసిస్తూ క్రీడల్లో మరింత రాణించే అవకాశం లభిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.
అందువల్ల ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే కిన్నెరసాని (బాలుర), కాచినపల్లి (బాలికలు) ప్రభుత్వ గిరిజన సంక్షేమ మోడల్ స్పోర్ట్స్ పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా మంజూరు చేసి, వెంటనే అవసరమైన పరిపాలనా ఉత్తర్వులు జారీ చేయాలని ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కోరారు.
గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధి, క్రీడా ప్రతిభను ప్రోత్సహించడం, భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించి త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు.

# సంత అభివృద్ధిపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక దృష్టి....

- **ఎమ్మెల్యే పాయం ఆదేశాల మేరకు కాంక్రీట్ పనుల అంచనాల తయారీలో ప్రజా ప్రతినిధులు..**


**మణుగూరు.జూలై 2 (డి డి 9వార్త)**

భద్రాద్రి జిల్లా,మణుగూరు మండలం,సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలో ఇటీవల ఏర్పాటు చేసిన గ్రామీణ సంత (అంగడి) అభివృద్ధి పై పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక దృష్టి సారించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని,ప్రజలకు,వ్యాపారస్తులకు ఇబ్బందులు కలగకుండా సంత జరిగే ప్రాంగణమంతా రోడ్డుకు ఇరువైపుల సిమెంట్ చేసే విధంగా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.అందులో భాగంగా సంత ప్రాంగణంలో పూర్తి కాంక్రీట్ పనులకు అంచనాలను తయారుచేసే ప్రక్రియ ను గురువారం నాడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సమితి సింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్ లు పాల్గొని మాట్లాడుతూ.. సంత అభివృద్ధికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేయడం పట్ల మండల ప్రజలు వారికి కృతజ్ఞతలు తెలియజేశారని, అలాగే సమితి సింగారం పాలక మండలి తరపున వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్ గణేష్ రెడ్డి, వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి జక్కుల అశోక్, ఇతర అధికారులు మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



# మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా దేవులపల్లి విజయకుమార్ ఎన్నిక.

**ఏటూరునాగారం, జూలై 02(డిడి9 వార్త).**



ఏటూరునాగారం మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా శంకరాజుపల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దేవులపల్లి విజయకుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు, అభిమానులు, గ్రామ ప్రజలు ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన దేవులపల్లి విజయకుమార్ కాంగ్రెస్ పార్టీకి ఎన్నో సంవత్సరాలుగా విధేయుడిగా సేవలందిస్తూ, పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేసిన నాయకుడు. ప్రజలతో సన్నిహితంగా మమేకమై వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండే వ్యక్తిగా మంచి గుర్తింపు పొందారు. స్థానిక సర్పంచ్‌గా ప్రజల విశ్వాసాన్ని సంపాదించి, ప్రజల ఆశీస్సులతో ఏకగ్రీవంగా ఎన్నికై గ్రామ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు. ఆయన సేవా దృక్పథం, నిజాయితీ, పార్టీ పట్ల అంకితభావాన్ని గుర్తించిన కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం మండల అధ్యక్ష బాధ్యతలను అప్పగించింది.
ఈ సందర్భంగా దేవులపల్లి విజయకుమార్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి, జిల్లా నాయకత్వానికి, మండల నాయకులకు, కార్యకర్తలకు మరియు తనను ఆశీర్వదించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

**పార్టీ బలోపేతమే నా లక్ష్యం.**

కార్యకర్తలందరినీ కలుపుకొని ముందుకు సాగుతాను. మండలంలోని ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తాను. ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడం నా అదృష్టంగా భావిస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు. దేవులపల్లి విజయకుమార్ ఎన్నికతో మండల కాంగ్రెస్ పార్టీలో నూతన ఉత్సాహం నెలకొన్నదని, ఆయన నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు విశ్వాసం వ్యక్తం చేశారు.



# తెలంగాణ రాష్ట్రంలో 72 వేల సభ్యత్వం కలిగిన ఏకైక సంఘం పిఆర్టియు టీఎస్

- **పింగిలి శ్రీపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం**
- **పిఆర్సి ని వెంటనే ప్రకటించి, సిపిఎస్ రద్దు చేయాలి**
- **పి ఆర్ టి యు టి ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు వేం యాకూబ్ రెడ్డి**


**ములుగు, జులై 2, డీ డీ 9 వార్త :**


ఆర్ టి యు టి ఎస్ రాష్ట్ర శాఖ ఆదేశానుసారం వెంకటాపూర్ మండలంలోని వివిధ పాఠశాలల్లో వెంకటాపూర్ మండలశాఖ అధ్యక్షులు అడిచర్ల రాజయ్య ఆధ్వర్యంలో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టడం జరిగింది.ఈ కార్యక్రమానికి ములుగు జిల్లా అధ్యక్షులు వేం యాకుబ్ రెడ్డి హాజరై రాష్ట్రంలో డెబ్బై రెండు వేల సభ్యత్వం కలిగిన ఏకైక సంఘం పి ఆర్ టి యు అని గుర్తు చేశారు. ఉపాధ్యాయులకు పి ఆర్ టి యు సంఘం సాధించి పెట్టిన జీవో లు మరియు ఆ జీవోల ద్వారా ఉపాధ్యాయులు పొందిందిన లబ్ది గురించి వివరించారు. ఉపాధ్యాయ సమస్య లలో ముఖ్యమైనటువంటి హెల్త్ కార్డులు మరియు పెండింగ్ బిల్లులు తదితరు అంశాలపై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ 2023 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేజీబీవీ ఉపాధ్యాయినిల సమస్యల సాధనలో పి ఆర్ టి యు టి ఎస్ ముందుంటుందన్నారు.వారికి మినిమం టైమ్ స్కేల్ సాధించే సంఘం ఆర్టీయుని అని అన్నారు. అదేవిధంగా మోడల్ స్కూల్ లో పనిచేస్తున్న ఉపాధ్యాయ సోదర సోదరీమణులకు హెల్త్ కార్డు ఇప్పించే బాధ్యత తో పాటుగా 010 పద్దు ద్వారా వేతనాలు అందేవిదంగా మరియు మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు కారుణ్య నియామకాలు వర్తింపచేసే విదంగా సంఘం భాద్యత తీసుకుంటుంది అని అన్నారు..ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ అర్హత పరీక్ష నిర్వహించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి ఉపాధ్యాయ పింగిలి శ్రీపాల్ రెడ్డి సాధించారాని ఈ సందర్బంగా వారు గుర్తు చేశారు..పిఆర్టియు 54 సంవత్సరాల ప్రస్థానంలో ఎన్నో ఉపాధ్యాయ సమస్యలను సాధించి ఈరోజు ఉపాధ్యాయుడు ఆత్మగౌరవంతో సఘర్వంగా తలెత్తుకొని తిరిగే విధంగా చేసిన సంఘం పిఆర్టియు అని అన్నారు.కావునా ఉపాధ్యాయులు విజ్ఞతతో అలోచించి సంఘములో సభ్యులుగా చేరి సంఘ బలోపేతంలో భాగస్వాములు కావాలన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు బండి సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కుందూరు సుబ్బారెడ్డి, పావుశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి చిట్టిబొమ్మల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల కిషోర్ బాబు, సూత్రాల రవి, శ్రీ గాజుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# దమ్మపేట మండలం లో పలు కార్యక్రమాలలో పాల్గొన్నా బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు సోయం వీరభద్రం ...

**అశ్వరావుపేట:జూలై 02(డిడి 9 వార్త)**

దమ్మపేట (మండలం) పార్కెలగండి (గ్రామం) లో కొండ్రు లక్ష్మడు రాములమ్మ దంపతుల కుమార్తె సాయిలతఅభిషేక్ ల రిసెప్షన్ కార్యక్రమం కి హాజరు అయ్యి నూతన వధువరులను ఆశీర్వధించి వివాహ శుభాకాంక్షలు తెలియాజేసిన సోయం
దమ్మపేట (మండలం) కొమ్ముగుడెం (గ్రామం) లో బుద్దుల రాజూబాబు రాములమ్మ దంపతుల ఆహ్వానం మేరకు నూతన గృహప్రవేశం కార్యక్రమం కి హాజరు అయి నూతన వస్త్రాలు అంధించి శుభాకాంక్షలు తెలియాజేసిన సోయం.లక్ష్మి తిరుపతమ్మ వీరభద్రం దంపతులు
దమ్మపేట మండలం గోరెగుట్ట గ్రామం లో సిపిఐ(ఎంఎల్) మాస్లైన్ పార్టీ మండల నాయకులు తాటి .సత్యం గారి పెద్దకర్మ కు హాజరు అయి చిత్రపటం కి పుష్పాంజలి ఘటించి నివాలులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం నింపిన బి.ఆర్.ఎస్ పార్టీ జిల్లా నాయకులు సోయం వీరభద్రం ఈ కార్యక్రమం లో ధాట్ల వెంకటేష్ ,పద్దం అశోక్,సమితి లక్ష్మణ్ రావు పూకే .నరసింహారావు ,సోయం వెంకన్నబాబు తధితరులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు





# డా ప్రవీణ్ కుమార్ మాజీ ఐపీఎస్ అధికారి

**తాడ్వాయి మండలం జూలై 02 (డిడి9 వార్త)**

దళితుడైన అడిషనల్ డీజీపీ సెక్యూరిటీని తగ్గించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరికాదని ఆనిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని అంబేద్కర్ యువజన సంఘం మేడారం జంపన్నవాయి (కొత్తూరు) యూత్ అధ్యక్షుడు గజ్జల నవీన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు



## మణుగూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కురం రవి ముదిరాజ్ నియామకం...

- **నమ్మకానికి దక్కిన గుర్తింపు...**

**మణుగూరు.జూలై 2 (డి డి 9వార్త)**



కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఎన్నో సంవత్సరాలుగా పార్టీ కోసం పనిచేసిన నాయకుడికి వచ్చిన అవకాశం. గతంలో రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మణుగూరు యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా పని చేసిన అనుభవం, అప్పటినుండి కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ పదవులు ఉన్నా లేకపోయినా పార్టీని నమ్ముకుని ఏ ఎన్నికలు వచ్చినా ముందుండి కష్టపడి పనిచేసి పార్టీ గెలుపులో కీలక పాత్ర వహిస్తూ క్రియాశీలక రాజకీయాల్లో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకొని స్థానిక ఎమ్మెల్యే కి , పార్టీకి అందుబాటులో ఉంటూ ఈరోజు మణుగూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు.ఈ సందర్భంగా కురం రవి ముదిరాజ్ మాట్లాడుతూ... టీపీసీసీ , డిసిసిల ఆదేశాల మేరకు, జనాభిమాన నాయకులు, అభివృద్ధి ప్రదాత, పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి అంకితభావంతో పనిచేస్తూ, పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేస్తానని,మండల , పట్టణ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్నానని తెలిపారు. నాపై విశ్వాసంతోనే మణుగూరు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులుగా నియమించారన్నారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన విశ్వాసానికి ఈ నియామకం నిదర్శనమని ఆయన అన్నారు. తమ కుటుంబం మొదటినుంచి పార్టీ కి చేసిన సేవలను గుర్తించి గౌరవ బాధ్యతను అప్పగించి, తనపై విశ్వాసం ఉంచిన పినపాక నియోజకవర్గ శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు కు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి, TPCC అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,MLC కు,మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి తోట దేవి ప్రసన్న లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కాంగ్రెస్ పార్టీని మణుగూరు పట్టణంలో మరింత బలోపేతం చేయడానికి అహర్నిశలు కృషి చేస్తానని, పార్టీ కార్యకర్తలకు ,నాయకులకు అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు డిమాండ్.. విజయవంతంగా కళాశాలల బంద్

**జనగామ, జూలై 2 (డీడీ9 వార్త)బ్యూరో**

విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన రూ.11 వేల కోట్ల పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ BC JAC పిలుపు మేరకు జనగామ జిల్లాలో కళాశాలల బంద్ విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా BC JAC కన్వీనర్ మంగళంపల్లి రాజు మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమైన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కొనసాగించడంతో పాటు పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పిట్టల సురేష్, గన్ను కార్తీక్, నల్లా రాహుల్, తుంగ కౌశిక్, వెంపటి అజయ్, పానుగంటి క్రిష్ణ తదితర నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## తాడ్వాయి మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన వెంగళపూర్ సర్పంచ్ గడ్డం నాగ భూషణం

**తాడ్వాయి మండలం జూలై 02 (డిడి9 వార్త)**

తాడ్వాయి మండలంలోని 18 గ్రామ పంచాయితీల సర్పంచులు సమావేశమై మండల సర్పంచుల ఫోరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు సర్పంచ్ ఫోరం అధ్యక్షులుగా గడ్డం నాగ భూషణం ఉపాధ్యక్షులుగా దిడ్డి మోహన్ రావు ప్రధాన కార్యదర్శిగా పీరిల భారతి వెంకన్న కోశాధికారిగా , వర్కింగ్ ప్రెసిడెంట్ గా , కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు గడ్డం నాగ భూషణం మాట్లాడుతూ మండలంలోని సర్పంచుల సమస్యల పరిష్కారం కోసం , గ్రామాభివృది కోసం నావంతు కృషి చేస్తానని తెలిపారు.ఏమైనా సర్పంచుల పెండింగ్ బిల్లులు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరం అయ్యేలా కృషి చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచులు మొగుళ్ళపల్లి రవీందర్ , తోలెం కృష్ణ , ముక్తి శ్రీనువాస్ , మంకిడి రజిత ప్రశాంత్ , కొమరం శైలజ , తిరుపతయ్య , వెంకటేశ్వర్లు , కోర్నబెల్లి సావిత్రి , ప్రవళిఖ , యాప కళా మోహన్ రావు , విజయ , శివప్రసాద్ , తదితరులు పాల్గొన్నారు



## గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలి..

- **సహచర ఎమ్మెల్యేలతో కలిసి వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.**

**మణుగూరు. జూలై 2(డి డి 9వార్త)**

హైదరాబాద్‌లో గురువారం నాడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారిని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, రాష్ట్ర మంత్రి సీతక్క (దనసరి అనసూయ), యెల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు లతో మర్యాదపూర్వకంగా కలిసి గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై వినతిపత్రాన్ని సమర్పించారు. వినతిపత్రంలో ఐటిడిఏ పరిధిలోని గిరిజన గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, అదనపు నిధుల మంజూరు, విద్య, ఉపాధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల అభివృద్ధి తెలంగాణ ప్రభుత్వ ప్రాధాన్యత కావాలని, ఐటిడిఏ పరిధిలోని గ్రామాలకు అదనపు బడ్జెట్ కేటాయించి, రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, సాగునీరు, ఉపాధి అవకాశాలను మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు.

అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద గిరిజన ప్రాంతాల్లో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి అదనపు ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన ప్రజలు సొంత ఇంటి కలను సాకారం చేసుకునేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని ముందుకు సాగుతోందన్నారు.రాష్ట్రంలోని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం, మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఇంద్ర మహిళా శక్తి కార్యక్రమాలు, స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక బలోపేతం, మహిళా సాధికారత, ఉపాధి అవకాశాల కల్పన, విద్య,



వైద్యం, రైతు సంక్షేమం, సామాజిక భద్రత వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని కొనియాడారు.

ప్రత్యేకించి ఇంద్ర మహిళా శక్తి ద్వారా మహిళలను పారిశ్రామికవేత్తలుగా,స్వయం ఉపాధి దిశగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక పురోగతి, కుటుంబాల అభివృద్ధి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఈ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, అదనపు నిధుల కేటాయింపు, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, విద్యా సంస్థల బలోపేతం, ఐటిడిఏ పరిధిలో మౌలిక వసతుల విస్తరణ వంటి అంశాలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు.

## SIR నిర్వహణలో BLAల పాత్ర కీలకం

- **గుడి వంశీధర్ రెడ్డి**

**జనగామ జూన్ 2(డిడి 9వార్త )బ్యూరో**

లింగాల ఘనపూర్ మండలం నెల్లుట్ల గ్రామంలో బూత్ లెవల్ ఏజెంట్ల (BLAలు) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ వైస్ ప్రెసిడెంట్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గుడి వంశీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియలో BLAల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి పౌరుడి ఓటు విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా BLAలు పనిచేయాలని సూచించారు.

ప్రతి పోలింగ్ కేంద్ర పరిధిలో ఓటర్ల మ్యాపింగ్ పూర్తి చేసి, ఇన్యూమరేషన్ ప్రక్రియలో BLOలకు సహకరించాలని కోరారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల అనంతరం సవరణలు, స్థాన చలనం, కొత్త ఓటర్ల నమోదు వంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని తెలిపారు. ఫారం 6 ద్వారా అర్హులైన కొత్త ఓటర్లను నమోదు చేయించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో గ్రామ సర్పంచ్ నర్సింగరామకృష్ణ, మార్కెట్ డైరెక్టర్ బుర్రేడ్డి శ్రీలత, ప్యాక్స్ డైరెక్టర్ గుర్రం బాలరాజు, గ్రామ శాఖ అధ్యక్షుడు బత్తిని బాలరాజు, రాజారవీందర్ రెడ్డి, ఉప సర్పంచ్ దామేరా ప్రభాకర్, బూత్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.



## అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన ఓరుగంటి రమేష్ బాబు..



- **నూతన అధ్యక్షున్ని ఘనంగా సన్మానించిన మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు.**

**మణుగూరు. జూలై 2(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గం, అశ్వాపురం మండలం లోని (ఓరుగంటి వీరయ్య భవన్) కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నూతన మండల అధ్యక్షుడిగా ఎన్నికైన ఓరుగంటి రమేష్ బాబుని ఘనంగా సన్మానించి మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలియజేసిన అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు.ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న కు, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు, తనను అభినందించిన నాయకులు, కార్యకర్తలకు మరియు శ్రేయోభిలాషులందరికీ నూతన మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు గారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ప్రజల ఆశయాలకు అనుగుణంగా పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఊస అనిల్ కుమార్, యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్స్ గొల్లపల్లి నరేష్ కుమార్, వేముల విజయ్,తాటి రాంబాబు, సోడే వెంకటేశ్వర్లు, సోడే నరసింహారావు, తాటి శ్రీను, కాసర్ల నరసయ్య, ఎస్ కే మేహారాజ్, వెంకటాపురం కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణలో కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి

- **అర్హులైన ప్రతి ఓటును నమోదు చేయించాలి**
- **-భద్రాచలం నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌ఛార్జి రావులపల్లి రాంప్రసాద్**

**భద్రాచలం , జూలై 2: , డిడి9 వార్త**

నియోజకవర్గంలో జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, న్యాయమైన ప్రతి ఓటును కాపాడేలా కృషి చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రావులపల్లి రాంప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం భద్రాచలంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని 179 పోలింగ్ కేంద్రాల పరిధిలో పార్టీ కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొనాలని, కొత్త ఓటర్ల నమోదుతో పాటు, తొలగించిన పేర్లను సరిచూసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే బాధ్యతను పార్టీ శ్రేణులు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మానే రామకృష్ణ మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో గులాబీ జెండాకు తిరుగులేదని, పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు ప్రబోద్ కుమార్, రేపాక పూర్ణచంద్రరావు, ఉడతా రమేష్, సునీల్ కుమార్, వార్డు మెంబర్ గోపి, గోసుల శ్రీనివాస్, కావూరి సీతామాలక్ష్మి, తెల్లం కామేశ్వరి, కణితి రాధ, ఎండి ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల సమస్యలను పరిష్కరించి, ప్రైవేట్ ఫీజులను నియంత్రించాలి: సీపీఎం డిమాండ్

**జనగామ జులై 2(డిడి 9వార్త )బ్యూరో**

చిల్పూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల సమస్యలను తక్షణమే పరిష్కరించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని నియంత్రించాలని డిమాండ్ చేస్తూ మండల విద్యాధికారి కార్యాలయం ముందు సీపీఎం చిల్పూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం మండల విద్యాధికారి గోవర్ధన్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని, గత వారం రోజులుగా సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన సర్వే నివేదికను అందజేశారు.

ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, ఘనపూర్ స్టేషన్ నియోజకవర్గ ఇంచార్జి రాపర్తి రాజు మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు అనేక సమస్యలతో సతమతమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకోవడం, గదుల కొరత, ఉపాధ్యాయుల కొరతతో పాటు తాగునీరు, ఆటస్థలం, కుర్చీలు, బెంచీలు, ప్రహరీ గోడలు, మరుగుదొడ్లు, ఆట వస్తువులు, కంప్యూటర్ల లాంటి కనీస మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం చొరవ చూపి నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే విధానాలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. మరోవైపు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఇష్టారీతిన ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు విద్యా సంస్థల అక్రమాలపై నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోకపోతే, పేద విద్యార్థులు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మండలంలో ప్రధానంగా చిన్నపెండ్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యలు ఆందోళనకరంగా ఉన్నాయని, అక్కడ కూలిపోయే స్థితిలో ఉన్న ప్రమాదకరమైన గోడలను వెంటనే తొలగించి, నూతన పాఠశాల భవనం, తరగతి గదులు, ప్రహరీ గోడ నిర్మించి కేజీ నుండి పీజీ తరగతులకు సిద్ధం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. అలాగే రాజవరం గ్రామపంచాయతీ పరిధిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించాలని, మల్కాపూర్ ఉన్నత పాఠశాలకు నూతన తరగతి గదులు, ప్రహరీ గోడ, మరుగుదొడ్లు కట్టించి, ఆధునిక ప్రయోగశాల ఏర్పాటుతో విద్యార్థులకు రక్షణ కల్పించాలన్నారు. వీటితో పాటు విద్యార్థులందరికీ వెంటనే దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, విద్యార్థి పరికరాల సంచులు (కిట్లు) అందించాలని, అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తూ ప్రైవేట్ పాఠశాలల ఫీజులను అదుపు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సాదం పరమేష్, వార్డు సభ్యులు ఊరడి బుచ్చిరాజు, పోలు శ్రీనివాస్, ముడిక భీమయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఘునాథపల్లి మండల కేంద్ర పరిధిలో బూత్ స్థాయి ఇన్చార్జిల సమావేశం

- **పాల్గొన్న జిల్లా ఉపాధ్యక్షులు లింగాల జగదీశ్ రెడ్డి**

**జనగామ జులై 2(డిడి 9వార్త) బ్యూరో**

రఘునాథపల్లి మండల కేంద్ర పరిధిలోని (ఎస్ ఐ ఆర్) బ్లాక్ క్లస్టర్ రెండు ఇన్చార్జిలైన శ్రావణ్ కుమార్, గొరిగే రవి ఆధ్వర్యంలో బానాజీపేట, కన్నయ్యపల్లి, గబ్బెట, కోడూర్, రామన్నగూడెం బూత్ స్థాయి ఇన్చార్జిలతో కన్నయ్యపల్లి గ్రామంలో ఒక ముఖ్యమైన సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు లింగాల జగదీశ్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షులు బోనాసి క్రాంతి కుమార్, ఆయా గ్రామాల సర్పంచులు, పూర్వ మండల పరిషత్ ప్రాంతీయ నియోజకవర్గ సభ్యులు (ఎమ్మెల్యేటీసీ) సోమనాథ్, బూత్ స్థాయి ఇన్చార్జిలు మరియు గ్రామ శాఖ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



# నమ్మకం.. నట్టేట ముంచింది...

- సుమారు రూ.30 కోట్ల పైగా టోకరా ?
- భద్రాద్రిలో కోట్ల రూపాయల టోకరా పెట్టిన కాంట్రాక్టర్
- భద్రాద్రిలో కలకలం రేపుతున్న కాంట్రాక్టర్ మాయాజాలం
- ఇళ్లకు తాళాలు.. ఫోన్లు స్విచ్ఆఫ్.. పరారీలో మోసగాడు
- రాతపూర్వక ఆధారాల్లేక లబోదిబోమంటున్న బాధితులు
- జిల్లాలో పెరుగుతున్న అనధికారిక ఆర్థిక లావాదేవీల ఉచ్చు
- వరుస మోసాలతో నలిగిపోతున్న అమాయకపు ప్రజలు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూలై 02,( డిడి9 వార్త )**



"నమ్మకమే మాకు ఉరితాడు అయ్యింది.. జీవితాంతం కష్టపడి కూడబెట్టుకున్న సొమ్ము, ఆశ చూపి అప్పు తెచ్చిన నగదు.. మొత్తం ఆ కాంట్రాక్టర్ చేతిలో పెట్టి ఇప్పుడు వీధిన పడ్డాం." ఇది భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రస్తుతం బాధితుల గుండెల్లోంచి వినిపిస్తున్న ఆవేదన. కాంట్రాక్టుల పేరుతో, అధిక లాభాల ఆశ చూపి సుమారు రూ.30 కోట్ల మేర వసూలు చేసి, అర్ధరాత్రికి అర్ధరాత్రి ఇళ్లకు తాళాలు వేసి పరారైన కాంట్రాక్టర్ వ్యవహారం జిల్లాను ఉలిక్కిపడేలా చేస్తోంది.

**వల వేసింది ఎలాగంటే..**

జిల్లాలో నిర్మాణ రంగం, కాంట్రాక్టులపై పట్టున్న సదరు కాంట్రాక్టర్, తనకున్న పరిచయాలను వాడుకుని తనదైన శైలిలో వల విసిరాడు. "పెద్ద పెద్ద ప్రభుత్వ కాంట్రాక్టులు చేస్తున్నా, పెట్టుబడి పెడితే భారీ లాభాలు వస్తాయి" అంటూ మొదట నమ్మకం కలిగించాడు. పదుల సంఖ్యలో ఉన్న బాధితులను నమ్మించేందుకు, మొదటి కొన్ని నెలలు లాభాలను చెల్లించి గాలం వేశాడు. ఆ నమ్మకంతోనే బాధితులు తమ ఆస్తులను తాకట్టు పెట్టి మరీ అతనికి అప్పుగా నగదు ఇచ్చారు. తీరా, చేతికి రూ.30 కోట్ల పైచిలుకు నగదు అందగానే, ఒక్కసారిగా సీన్ రివర్స్ చేశాడు.

**--పరారీలో 'వ్యాపార' కిలాడీ**

గత కొద్ది రోజులుగా సదరు కాంట్రాక్టర్ ఫోన్ స్విచ్ఆఫ్ రావడం, ఇంటికి తాళాలు వేసి ఉండటంతో బాధితులు అవాక్కయ్యారు. వెతికినా ఫలితం లేకపోవడంతో, తాము మోస పోయామని గ్రహించి లబోదిబోమంటున్నారు. సోషల్ మీడియాలో ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో, ఒక్కొక్కరుగా బాధితులు బయటకు వస్తున్నారు.

**ఆధారాల్లేక.. పోలీసులు ఏమంటారోనని..**

ఈ లావాదేవీలన్నీ కేవలం నమ్మకం మీద, నోటి మాటతోనే జరగడం బాధితుల పాలిట శాపంగా మారింది. రాతపూర్వక ఒప్పందాలు లేకపోవడంతో, పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు బాధితులు జంకుతున్నారు. "ఒకవేళ కేసు పెడితే, అతడు పోలీసుల చేతికి చిక్కినా మా డబ్బులు తిరిగి వస్తాయా? లేక పరువు పోతుందా?" అన్న సందిగ్ధంలో బాధితులు మౌనంగానే బాధను దిగమింగుతున్నారు. జిల్లాలో ఇలాంటి అనధికారిక ఆర్థిక లావాదేవీలు ఒక మహమ్మారిలా మారుతున్నాయని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

**--అప్రమత్తతే ఏకైక మార్గం**

"అధిక లాభాల ఆశ చూపే వ్యక్తుల పట్ల ఎంతటి సన్నిహితులైనా సరే.. అప్రమత్తంగా ఉండాలి. రాతపూర్వక ఒప్పందాలు, బ్యాంక్ లావాదేవీలు లేని చోట ఆర్థిక వ్యవహారాలు జరపడం అంటే ప్రమాదాన్ని కొని తెచ్చుకోవడమే" అని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

**ప్రభుత్వం, పోలీసుల స్పందన ఆశిస్తూ..**

ప్రస్తుతం ఈ వ్యవహారం భద్రాద్రి జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇలాంటి మోసగాళ్లను ఉపేక్షిస్తే, మరిన్ని కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు తక్షణమే స్పందించి, బాధితుల గోడు విని, పరారీలో ఉన్న కాంట్రాక్టర్‌ను గుర్తించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# అమెరికాలో నైట్ రైడర్స్ క్రికెట్ గ్రౌండ్.. కల నెరవేరిందన్న షారుఖ్!

- లాస్ ఏంజిల్స్‌లో నైట్ రైడర్స్ క్రికెట్ గ్రౌండ్ ప్రారంభం
- ఇది ఎప్పటినుంచో కంటున్న కల అని చెప్పిన షారుఖ్ ఖాన్
- అంతర్జాతీయ స్టేడియం నిర్మించిన తొలి గ్లోబల్ క్రికెట్ ఫ్రాంచైజీగా రికార్డు
- మేజర్ లీగ్ క్రికెట్‌లో భాగంగా తొలి మ్యాచ్ నిర్వహణ

**డిడి9 వార్త:**



బాలీవుడ్ సూపర్ స్టార్, కోల్‌కతా నైట్ రైడర్స్ సహ యజమాని షారుఖ్ ఖాన్ చిరకాల స్వప్నం నెరవేరింది. అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో 'నైట్ రైడర్స్ క్రికెట్ గ్రౌండ్' ప్రారంభం కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇది అమెరికాలో క్రికెట్ విస్తరణకు ఒక చారిత్రాత్మక మైలురాయి అని ఆయన అభివర్ణించారు.

పొమోనాలోని ఫెయిర్‌ప్లెక్స్‌లో అత్యాధునిక హంగులతో నిర్మించిన ఈ మైదానంలో జులై 1న తొలి మేజర్ లీగ్ క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. లాస్ ఏంజిల్స్ నైట్ రైడర్స్, వాషింగ్టన్ ఫ్రీడమ్ జట్ల మధ్య ఈ మ్యాచ్ జరిగింది. తద్వారా తమ సొంత విపణి వెలుపల అంతర్జాతీయ స్థాయి స్టేడియం నిర్మించిన తొలి గ్లోబల్ క్రికెట్ ఫ్రాంచైజీగా నైట్ రైడర్స్ గ్రూప్ రికార్డు సృష్టించింది.

ఈ సందర్భంగా షారుఖ్ ఖాన్ మాట్లాడుతూ, "ఒకప్పుడు కలగా ప్రారంభమైన ఈ ప్రాజెక్టు నేడు వాస్తవరూపం దాల్చింది. ప్రపంచంలో అత్యధికంగా వీక్షించే రెండో క్రీడ అయిన క్రికెట్‌ను లాస్ ఏంజిల్స్‌కు తీసుకురావడం ఒక చరిత్రాత్మక ఘట్టం. ఇది కేవలం క్రీడా వేదిక మాత్రమే కాదు, సమాజం, వినోదం, కుటుంబాల కోసం నిర్మించిన ప్రదేశం. దీనిని లాస్ ఏంజిల్స్ ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులకు అంకితం చేస్తున్నాను" అని వివరించారు. ఈ ప్రాజెక్టు విజయవంతం కావడానికి సహకరించిన ఐసీసీ ఛైర్మన్ జై షా తదితరులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

నైట్ రైడర్స్ స్పోర్ట్స్ సీఈఓ వెంకీ మైసూర్ మాట్లాడుతూ, ఈ స్టేడియం క్రికెట్ భవిష్యత్తుకు ఒక నిదర్శనమని పేర్కొన్నారు. సుమారు 21 మిలియన్ డాలర్ల వ్యయంతో, కేవలం 100 రోజుల్లోనే ఈ స్టేడియం నిర్మాణాన్ని పూర్తి చేశారు. ప్రస్తుతం 5,000 మంది కూర్చునే సామర్థ్యం ఉన్న ఈ మైదానాన్ని, 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ నాటికి 15,000కు పెంచనున్నారు. ఒలింపిక్స్‌లో టీ20 క్రికెట్ పోటీలకు ఈ మైదానం ఆతిథ్యం ఇచ్చే అవకాశం ఉంది.

# సూర్యవంశీ ఆటకోసం యావత్ ప్రపంచం ఎదురుచూస్తోంది

- త్వరలో 3 ఫార్మాట్లలోరూ వైభవ్ ఆడతాడని కరీమ్ ధీమా
- ఏ బౌలింగ్‌నైనా ఎదుర్కొగలడని ప్రశంస
- వైభవ్ ప్రతిభ గురించి ముందే తెలిసిందన్న మాజీ సెలెక్టర్

**డిడి9 వార్త:**

ఐపీఎల్2026లో సంచలన ప్రదర్శనతో క్రికెట్ ప్రపంచం దృష్టిని ఆకర్షించిన యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీపై మాజీ భారత వికెట్‌కీపర్, మాజీ సెలెక్టర్ సబా కరీమ్ ప్రశంసల వర్షం కురిపించాడు. భారత అభిమానులతో పాటు ప్రపంచమంతా అతని ఆటను చూడాలని ఆసక్తిగా ఎదురుచూస్తోందని అన్నాడు. త్వరలోనే భారత్ తరఫున మూడు ఫార్మాట్లలోనూ సూర్యవంశీ ఆడతాడని తనకు పూర్తి నమ్మకం ఉందని చెప్పాడు.

ఐపీఎల్2026లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన సూర్యవంశీ 776 పరుగులు చేసి, 237.30 స్ట్రైక్‌రేట్‌తో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచాడు. విరాట్ కోహ్లీ అద్భుత సీజన్ తర్వాత గుర్తుండిపోయే ఐపీఎల్ సీజన్ ఏదైనా ఉంటే అది సూర్యవంశీదేనని సబా కరీమ్ అభిప్రాయపడ్డాడు. అగ్రశ్రేణి బౌలర్లపై అతను ఆడిన తీరు అసాధారణమని కొనియాడాడు.

ఐపీఎల్2025 వేలానికి ముందే సూర్యవంశీ ప్రతిభ గురించి తనకు సమాచారం వచ్చిందని కరీమ్ గుర్తు చేసుకున్నాడు. అతడికి కనీసం ఒక మ్యాచ్‌లోనైనా అవకాశం రావాలని కోరుకున్నానని, తొలి బంతినే ధైర్యంగా ఎదుర్కొన్న తీరు తనను ఆశ్చర్యపరిచిందన్నాడు. ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ఆడటమే సూర్యవంశీ ప్రత్యేకత అని చెప్పాడు.

రెండో సీజన్‌లో బౌలర్లు అతడిపై ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తారనే అంచనాలు ఉన్నప్పటికీ, అలాంటి ఇబ్బందులు ఎదురుకావని తాను ముందే భావించానన్నాడు. రాజస్థాన్ రాయల్స్ బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ కూడా ఇదే విషయాన్ని చెప్పారని వెల్లడించాడు. వేగవంతమైన బౌలింగ్‌ను ఎదుర్కొనేందుకు సూర్యవంశీ తన



ఆటలో అప్పర్‌కట్, కవర్స్ డ్రైవ్, ఇన్‌సైడ్‌అవుట్ వంటి కొత్త షాట్లను జోడించాడని, ఏ పరిస్థితుల్లోనైనా రాణించే సామర్థ్యం అతనికి ఉందని ప్రశంసించాడు.

# ఆర్ఐటీఐలో తొలి విడత ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**భద్రాచలం , జూలై 2 (డిడి9 వార్త)**




భద్రాచలంలోని ఆర్ఐటీఐలో 202627 విద్యా సంవత్సరానికి తొలి విడత ఐటీఐ ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్ఐటీఐ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు తెలిపారు. మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ టెక్నీషియన్, వర్చువల్ అనాలిసిస్ అండ్ డిజైనర్, సి.ఎన్.సి మెషినింగ్ టెక్నీషియన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్, ఇంజినీరింగ్ డిజైన్ టెక్నీషియన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఆసక్తి గల అభ్యర్థులు ఐటీఐ తెలంగాణ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సీట్ల కేటాయింపు రోజువారీ మెరిట్ ప్రాతిపదికన ఆన్‌లైన్‌లో జరుగుతుందని, ఎంపికైన అభ్యర్థుల మొబైల్ ఫోన్లకు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

ఎస్ఎంఎస్ అందుకున్న అభ్యర్థులు పదో తరగతి మెమో ఒరిజినల్, కుల ధ్రువీకరణ పత్రం, బోనాఫైడ్ సర్టిఫికెట్, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టీ.సీ)తో పాటు రెండు సెట్ల జిరాక్స్ ప్రతులతో సంబంధిత ఐటీఐలో హాజరుకావాలని సూచించారు. తొలి విడత ప్రవేశాలకు ఈ నెల 10వ తేదీ వరకు గడువు ఉందని ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు తెలిపారు.

# ఓటరు జాబితా సవరణకు ప్రజలు సహకరించాలి..

- ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఏలు..

**జూలై02 డిడి9 వార్త వెంకటాపురం.**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ప్రజలంతా చురుకుగా పాల్గొని ఓటరు నమోదు, వివరాల సవరణ ప్రక్రియలో సహకరించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు.

గురువారం ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత దరఖాస్తు ఫారాలను పంపిణీ చేసి, ఓటరు నమోదు, పేర్ల మార్పులు, చిరునామా సవరణలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవడంతో పాటు, ఇప్పటికే నమోదైన వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు చేసుకోవాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ధనపనేని వెంకటేశ్వర్లు, బీఎస్ఓ దల్లి మీనా కుమారి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిడెం సాంబశివరావు, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు చిట్టం సాయి, మాజీ ఎంపీటీసీ కే. సీతాదేవి, కాంగ్రెస్ నాయకులు శ్రీరాములు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# కన్నాయిగూడెం కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా జాడి రాంబాబు

**కన్నాయిగూడె, జులై 2 (డిడి9 వార్త ) :**



ములుగు జిల్లా కన్నాయిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా జాడి రాంబాబును పార్టీ అధిష్ఠానం నియమించింది. ఈ సందర్భంగా ఆయనకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జాడి రాంబాబు మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు.మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కార్యకర్తలతో కలిసి సమిష్టిగా పనిచేస్తానని పేర్కొన్నారు.

# విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం

**బోనకల్,జూలై 2,(డీడీ9 వార్త):**

మండల వనరుల కేంద్రాన్ని గురువారం ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారి సదానందం సందర్శించారు,ఈ సందర్భంగా మండలంలో గల పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు, పాఠశాలల ఎన్రోల్మెంట్,అటెండన్స్,నాణ్యమైన విద్య,శానిటేషన్,పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా పని చేయాలన్నారు,విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలన్నారు, వీటితో పాటు మరికొన్నీ అంశాలను రివ్యూ చేయడం జరిగింది. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి సదానందంను ఉపాధ్యాయులు శాలువతో ఘనంగా సన్మానించారు,ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి దామాల పుల్లయ్య,సిఎచ్ఎంఎస్ గోపీచంద్,ముంతాజ్ బేగం ,ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500201. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.